

హైలెవల్ ఛానల్‌లో గుర్రపుడెక్క

మరమ్మతులు జరిగేనా?

సాగునీరు పారాల్సిన కాల్వలు.. తూటికాడ, జమ్ము, రబ్బరు మొక్కలతో నిండిపోయాయి. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చివరి భూములకు సాగునీరు అందించాల్సిన కాల్వలు పూడికతో నిండిపోయాయి. సాగునీటి కాల్వల కట్టలు కోతకు గురై ఉన్నాయి. సాగునీరు సక్రమంగా అందక పంటలు ఎండిపోతున్నా పాలకులకు పట్టలేదు. ఐదేళ్లు అటు వర్షాభావం.. ఇటు అరకొర ఉన్న సాగునీరు కాల్వల ద్వారా సక్రమంగా అందక రైతులు అల్లాడిపోయారు. అయినా పాలకులు కాల్వల మరమ్మతుల గురించి పట్టించుకోలేదు.. రైతుల గోడు ఆలకించలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వంలో అయినా సాగునీటి కాల్వల బాగుపై దృష్టి సారిస్తారని రైతులు ఆశిస్తున్నారు. ఖరీఫ్‌కు సాగునీటి ఇబ్బందులు లేకుండా కనీసం తాత్కాలిక మరమ్మతులు తక్షణం చేయాలని రైతులు కోరుతున్నారు.

- అధ్వానంగా సాగునీటి కాల్వలు
- నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- డెల్టా పరిధిలోని కాల్వలకు స్వల్పకాలిక టెండర్లు
- ప్రతిపాదనల దశ దాటని సాగర్ కుడి కాల్వల బాగు


కొమ్మమూరు కాల్వలో కోతపడిన కట్ట వెంట వేసిన ఇసుక మూటలు


కాల్వలో నీటి ఉధృతికి కొట్టుకుపోతున్న గుర్రపు డెక్క

గతంలో పనులు చేయకుండానే దోచేశారు

ఖరీఫ్ సీజన్ వస్తుందంటే మూడు నెలల ముందు నుంచి డెల్టా కాల్వల మరమ్మతులు, అత్యవసర మరమ్మతులు పూర్తిచేసే పనిలో నీటిపారుదల శాఖ తలమునకలై ఉండేది. కానీ గత నాలుగు సీజన్లలో ఒక్కపని కూడా లేదు. ప్రభుత్వం రైతుల కోసం కేటాయిస్తానన్న నిధుల మాట అటుంచితే, అత్యవసర పనులు చెయ్యాల్సిన తరుణంలోనూ మొండిచెయి చూపుతూ వచ్చింది. గతంలో సాగునీటి కాల్వల మరమ్మతుల కోసం సాధారణ నిధులు, ప్రత్యేక మరమ్మతుల కోసం నిధులను ప్రభుత్వం విడుదల చేసేది. ఇవేకాక ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్(ఓఅండ్ఎం) కింద కూడా కొన్ని నిధులు మంజూరు చేసేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక అవన్నీ పోయి చివరకు ఓఅండ్ఎం నిధులే దిక్కయ్యాయి. అవికూడా విదిలింపులే ఉండటంతో పనులు జరిగిన పరిస్థితి లేదు. ఆ కొద్దిపాటి నిధులను కూడా కాల్వలు ఖాళీగా ఉన్నప్పుడు కాకుండా, కాల్వలకు నీరు వదిలే సమయంలో విడుదల చేసి, హడావిడి చేసినట్లు చూపించి, చివరకు వాటిలో 80 శాతం నిధులు ఆ పార్టీ నేతలే కాంట్రాక్టర్‌లుగా అవతారమెత్తి దోచేసిన సందర్భాలున్నాయి. గత ఖరీఫ్ సీజన్‌లోనూ రూ.22 కోట్లు ప్రభుత్వం ఓఅండ్ఎం కింద మంజూరు చేస్తే, వాటిలో తూటుకాడ తొలగింపు, పూడికతీత పేరుతో మొత్తం దోచేశారు.

రూ.22.54 కోట్ల ప్రతిపాదనలతో సరి

నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో మేజర్లు, మైనర్లు, సబ్ మైనర్ కాల్వలు అధ్వానస్థితికి చేరుకున్నాయి. డ్రాపులు పగిలిపోయాయి. షట్టర్లు కూడా దెబ్బ తిన్నాయి, చాలా మైనర్లకు నీటిని సరఫరా చేసే తూములకు కనీసం షట్టర్లు కూడా లేవు. దీంతో నీటి సర ఫరాలో నియంత్రణ ఉండటంలేదు. సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. మరమ్మతులకు జలవ నరుల శాఖ రూ.22.54 కోట్లతో ప్రతిపాదనలు పంపింది. మరమ్మతులు తప్పనిసరి అయినా ప్రభుత్వం నిధులు విడుదల ఊసెత్తకపోతుండటంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినుకొండ, లింగంగుంట్ల, సత్తెనపల్లి డివిజన్లలో అత్యవసర మరమ్మతులకు సంబంధించి 473 పనులను గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ22.54 కోట్లు వ్యయం అంచనా వేశారు. ఈ పనులపై ఇటీవల మంత్రి నిమ్మల సమీక్షించినా నేటి వరకు నిధులు కేటాయింపులు లేవు.



పల్నాడులో కాల్వలు కనిపించనంతగా పెరిగిన కంప చెట్లు

నరసరావుపేట, తెనాలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దెబ్బతినిపోయి గండ్లు పడటానికి సిద్ధంగా ఉన్న కాల్వ కట్టలు. కాల్వల్లో సాగునీరు కిందికి పోకుండా కమ్మేసిన గుర్రపుడెక్క. షట్టర్లకు రంధ్రాలు పడి, చెక్కలు అడ్డుపెట్టినా వృథాగా పోతున్న సాగునీరు. ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఉన్న సాగునీటి కాల్వలు, డ్రెయిన్ల దుస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో ఈ ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు చివరి భూములకు చేరడం కష్టమే. నీటి విడుదల ఆలస్యమైనా, నీరు చివరి వరకు చేరకున్నా పంట దిగుబడులపై ప్రభావం చూపే పరిస్థితి. అయినా నాటి పాలకులు సాగునీటి వ్యవస్థ గురించి కనీసంగా కూడా ఆలోచించలేదంటే ఆశ్చర్యం కాదు. డెల్టా పరిధిలో గత నాలుగు సీజన్లలో ఒక్క పనికూడా జరిగిన దాఖలాలే లేవు. దీంతో సాగునీటి కష్టాలు మరింత పెరిగిపోయాయి. చుక్కనీరు చివరి భూమి వరకు వెళ్లాలంటే ఒక ప్రహసనమే. కేవలం చిల్లర విదిలింపులతో అప్పటి వైసీపీ సర్కారు సరి పెట్టింది. దీంతో ఒక్క గండీ పూడ్చలేని పరిస్థితి. కాల్వ కట్టలు దెబ్బతినిపోయినా, గండ్లు పడినా, చివరి భూములకు నీరు అందకపోయినా అడిగే దిక్కేలేదు. అప్పట్లో ఓఅండ్ఎం నిధులే దిక్కు. అవికూడా ప్రతిపాదనలు పంపినంత కాకుండా వారికి తోచినంత ఇచ్చి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. సాగునీరు చివరి భూముల వరకు అందాలంటే కాల్వలే కీలకం. అయితే ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ కాల్వలు గత నాలుగేళ్లుగా అధ్వానంగా మారిపోయాయి. పట్టించుకునే దిక్కులేక, దెబ్బతిన్న కట్టలను బాగుచేసేవారులేక, షట్టర్లు తుప్పు పట్టిపోయిన పరిస్థితి. ఇక కాల్వల్లో నీరు ప్రవహించడానికి దారిలేదన్నట్లు పిచ్చిచెట్లు, ముళ్ల కంపలు, తూటుకాడ, గుర్రపు డెక్క పెరిగిపోయి అడ్డుగా మారిపోయాయి. ప్రస్తుతం ఆశాజనకంగా వర్షాలు పడుతున్నాయి. జలాశయాలకు పుష్కలంగా నీరు వస్తోంది. ఈ పరిస్థితుల్లో సాగునీటి కాల్వల మరమ్మతుల విషయంలో దేనినీ ఆలస్యం చేయడానికి వీలులేదు. మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేసేందుకు ప్రభుత్వం సత్వరం చర్యలు తీసుకోవాలి. ఐదేళ్లుగా సాగర్ పరిధిలోని కాల్వల్లో పూడిక తీత నోచుకోలేదు. కూటమి ప్రభుత్వంలో ఇటీవల మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్షించగా.. పనులు నిర్వహణ ప్రతిపాదనలకే పరిమితమైంది. నిధుల విడుదలపై నేటి వరకు ఎటువంటి ప్రకటన వెలువడలేదు.

ఈ ఏడాదికి కాలువలకు మరమ్మతు లేనట్లేనన్న అభిప్రాయం అధికారుల నుంచి వ్యక్తమవుతోంది. కాలువలు బాగు చేయకపోతే సాగునీటి పారుదలకు ఇబ్బందులు ఏర్పడతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక కృష్ణా పశ్చిమ డెల్టా కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం ఇటీవల రూ.13.62 కోట్లు మంజూరు చేసింది. అయితే అటు పట్టిసీమ నీరు, ఇటు వర్షాలతో ప్రస్తుతం కాల్వల్లో నీరు పుష్కలంగా పారుదల అవుతుంది. దీంతో కాల్వల మరమ్మతులకు ఇబ్బందులు తప్పడంలేదు. కాల్వలకు సకాలంలో నీరొచ్చిందన్న ఆనందం కాల్వల ఎగువ భూముల రైతులకుంటే, చివరి భూముల రైతులు మాత్రం నీరు అందని పరిస్థితుల్లో మరమ్మతులు జరిగితే బాగుంటుందని ఎదురు చూస్తున్న పరిస్థితి.

డెల్టాలో పనులపై సందిగ్ధత

కృష్ణా పశ్చిమ డెల్టాలో అత్యవసర మరమ్మతుల కోసం ఈ సీజన్‌కు ప్రభుత్వం రూ.13.62 కోట్లు మంజూరు చేసింది. వీటితో డెల్టా కాల్వలు, డ్రెయిన్లలో అత్యవసరమనుకున్న 188 పనులు పూర్తి చేసేందుకు నీటిపారుదల శాఖ సన్నద్ధమయింది. కృష్ణా పశ్చిమ విభాగం పరిధిలో 85 పనుల కోసం రూ.4.98 కోట్లు, రేపల్లె, చీరాల డ్రెయినేజి డివిజన్‌ల పరిధిలో 98 పనులకు రూ.7.3 కోట్లు, గుంటూరు వాహిని కింద 5 పనుల కోసం రూ.1.31 కోట్లు కేటాయించారు. అయితే ఇప్పటికే కాల్వలకు నీరొచ్చేయటం, డెల్టాలో వరి సాగు వెద పద్ధతిలో మొదలవడంతో పనులు ఆచరణలో ఎంతవరకు సకాలంలో పూర్తవుతాయనేదే సందేహంగా మారింది. నీటిపారుదల శాఖ అధికారులు పనులను చిన్నవిగా విభజించి, స్వల్పకాలిక టెండర్లను పిలిచింది. అయితే కాంట్రాక్టర్ల మధ్య ఒప్పందం పూర్తై, వారు పనులు మొదలుపెట్టడానికి ఇంకా పక్షం రోజులు పట్టే పరిస్థితి. ఈ తరుణంలో పనులు సాగేతీరుపై సందిగ్ధత నెలకొంది.

నల్లపాడు చెరువుకు గ్రహణం

- ఐదేళ్లుగా పూడికతీతకు నోచుకోని వైనం
- నివాస ప్రాంతాల నుంచి మురుగునీరు
- ఆందోళన చెందుతున్న రైతులు, స్థానికులు


నల్లపాడు చెరువు చిత్రం


చెరువులోకి వస్తున్న మురుగునీరు

గుంటూరు(తూర్పు), జూలై 26: దాదాపు 70-80 ఎకరాల చెరువు.. ఐదు గ్రామాలకు సాగునీరు.. పశువులకు తాగునీరు అందించే సుదీర్ఘ చరిత్ర కలిగిన నల్లపాడు చెరువుకు గ్రహణం పట్టింది. స్థానిక 27 డివిజన్ పరిధిలో ఉన్న చెరువుపై గత పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వహించారు. దీంతో దాదాపు ఐదు గ్రామాలకు సాగు నీరు, పశువులకు తాగు నీరు లేక అల్లాడిపోతున్నారు. దీనిపై గత ప్రభుత్వంలో అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. కనీసం నూతన ప్రభుత్వంలోనే ఈ చెరువుకు మంచి రోజులు వచ్చి గ్రహణం వీడుతుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు. గుంటూరు నగర పరిధిలోని నల్లపాడు చెరువుకు సాగర్ నుంచి వంకాయలపాడు కాల్వ ద్వారా నీరు అందుతుంది. మోటార్ల సాయంతో తురకపాలెం, నల్లపాడు, చల్లావారిపాలెం, అంకిరెడ్డిపాలెం, లింగాయిపాలెం గ్రామాల పరిధిలోని పొలాలకు సాగు నీరు అందుతుంది. గత ప్రభుత్వాలు చెరువులో పూడికతీత, గుర్రపు డెక్కను తొలిగించి రైతులకు, స్థానికులకు ఉపయోగకరంగా చేసేవి.

రూపు కోల్పోయిన చెరువు


వైసీపీ అధికారంలోకి రాగానే ఈ చెరువు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ఐదేళ్లలో కనీసం పూడికతీతకు నోచుకేలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఆక్రమణల చెరువు విస్తీర్ణం తగ్గిపోయింది. దీంతో కాల్వ నుంచి చెరువుకు వచ్చే నీరు నిల్వ లేక ఆయకట్టులోని పొలాలకు సాగు నీరు అందని పరిస్థితి ఏర్పడింది. చెరువు సమీపంలో పెద్దసంఖ్యలో వెలసిన గృహ సముదాయాల నుంచి వచ్చే మురుగు నీరు చెరువులోకి చేరుతుంది. నివాస ప్రాంతాల నుంచి మురుగునీరు నల్లపాడు వద్ద ఉన్న డ్రెయినేజీలో కలుపుతామని చెప్పిన రియల్టర్లు అందుకు విరుద్ధంగా చెరువులోకి వచ్చేలా పైపులైన్లు ఏర్పాటు చేశారు. దీంతో చెరువు పూర్తిగా కలుషితమైంది. దీనిపై 2022లో నగరపాలక సంస్థలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి మురుగు పైపులైన్లు వద్ద అడ్డుకట్ట కట్టారు. కానీ అప్పటి హోంమంత్రి అనుచరులు, స్థానిక వైసీపీ నాయకుడి సహకారంతో అడ్డుకట్టను తొలగించారు. దీనికి అప్పటి నగరపాలక సంస్థ అధికారులు సహకరించారనే ఆరోపణలున్నాయి. దీంతో గతంలో మాదిరిగానే మురుగునీరు చెరువులోకి చేరుకుంది.

ప్రజాప్రతినిధులు స్పందించాలి

చెరువులోకి కలుషిత నీటి రాకపై తాజాగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు స్పందించి, చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. గతంలో చెరువు పక్కన వాకింగ్ ట్రాక్, ప్రహరీ ఏర్పాటుకు రూపొందించిన నివేదికలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మట్టిని తవ్వడానికే చెరువును పాడు బెడుతున్నారనే ఆరోపణలపై విచారణ చేయాలంటున్నారు. పూడిక, గుర్రపు డెక్క తొలగించి మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వడివడిగా..కృష్ణమ్మ

శ్రీశైలం జలాశయానికి జలకళ



జలాశయాల్లో నీటి నిల్వల వివరాలు...

జలాశయం	పూర్తి స్థాయి నీటి నిల్వ టీఎంసీలలో	ప్రస్తుత నిల్వ టీఎంసీలలో	వస్తున్న వరద నీరు క్యూసెక్కుల్లో	విడుదల చేస్తున్న నీరు క్యూసెక్కుల్లో
ఆల్మట్టి	123.08	83.48	2,04,098	2,66,586
నారాయణపూర్	33.31	26.85	2,61,397	2,65,494
జూరాల	9.66	5.99	2,24,083	2,26,375
తుంగభద్ర	105.78	96.25	87,766	84,149
శ్రీశైలం	215.81	110.47	2,46,965	31,784
నాగార్జున సాగర్	312.05	123.34	29,589	6,990
పులిచింతల	45.77	1.03	276	50

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణమ్మ వడివడిగా వస్తోంది. శ్రీశైలం దిశగా పరుగులు పెడుతూ వస్తోంది. దీంతో అంతకంతకు జలాశయానికి వరద నీరు పోటెత్తుతోంది. దాదాపు 2.46 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోంది. ఇది క్రమంగా మూడు లక్షల క్యూసెక్కులు దాటే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీశైలానికి 10 రోజుల వరకు వరద ప్రవాహం కొనసాగుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. ఇప్పటికే 110 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నాగార్జునసాగర్ జలాశయా నికి శుక్రవారం నీటిని విడుదల చేశారు. నాలుగు రోజుల్లో సాగర్ జలాశయానికి కూడా భారీగానే వరద నీరు వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో కుడికాల్వ ఆయకట్టుకు సాగునీటి భరోసా వస్తోంది. గత ఏడాది వరి సాగు కోల్పోయిన రైతుల్లో ఈ ఏడాది ఆశలు చిగురిస్తున్నాయి. కృష్ణానది పరివాహక ప్రాంతంలో గత రెండు రోజుల్లో 600 మీమీ వర్షపాతం నమోదైనట్లు వాతావ రణశాఖ ప్రకటించింది. దీంతో ఆల్‌మట్టి, తుంగభద్ర జలాశయా లకు వరద నీటి ప్రవాహం పెరగనున్నది. ఇప్పటికే శ్రీశైలం ఎగువ ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీటి నిల్వ చేరింది. దీంతో ఆయా జలాశయాలకు వస్తున్న వరదనీటిని దిగువకు వదిలేస్తున్నారు. శ్రీశైలం జలాశ యానికి వరద నీరు రెండు రోజుల్లో రానున్నది. నారాయణపూర్ జలాశయానికి వస్తున్న నీటిని అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తం 3.12 లక్షల కూసెక్కుల నీరు శ్రీశైలానికి రానున్నది. శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తూ సాగర్‌కు 30,784 క్యూసెక్కుల నీరు వస్తున్నది. తాగునీటి అవసరాలకు కుడి కాల్వకు సాగర్ నుంచి 6,990 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

విద్యార్థులకు వసతి సదుపాయం కల్పించాలి

● కేంద్ర మంత్రి మురుగన్‌ను కోరిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు


కేంద్ర మంత్రి మురుగన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

మాచర్లటౌన్, జూలై 26: మాచర్లలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో విద్యార్థులకు వసతిగృహం కల్పించాలని, పట్టణంలో ఖాళీగా ఉన్న భారత ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని భవనం లీజుకు అనుమతి ఇవ్వాలని కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్‌ను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి మురుగన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. హాస్టల్ సౌకర్యం కోసం ప్రభుత్వ భవనం లేకపోవడంతో వసతిగృహాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పట్టణంలోని వివిధ కళాశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన నిరుపేద బాలికలు విద్యనభ్యసిస్తున్నారని, వారికి భవనాల కొరత తీవ్రంగా ఉందని వివరించారు. మాచర్ల పట్టణంలో భారత ప్రసార మంత్రిత్వ శాఖ సిబ్బంది కోసం ఇరవై గదులతో భవనాన్ని నిర్మించిందని, అవి ఉపయోగంలో లేవని, ఆ భవనాన్ని లీజుకు ఇచ్చేందుకు అనుమతులు ఇవ్వాలని ఎంపీ కోరారు.

ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

పొన్నూరుటౌన్, జూలై 26: ఈ నెల 31వ తేదీ నుంచి పొన్నూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి డిప్లమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తునట్లు చెప్పారు, 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో జరిగే స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావలసినదిగా సూచించారు.

శక్తివంతమైన భారత్ కోసం కార్గిల్ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి



కార్గిల్ ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి, సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, హాజరైన కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్‌లు

గుంటూరు సిటీ, జూలై 26: 2047 నాటికి దేశాన్ని గొప్ప శక్తివంతమైన దేశంగా మార్చేందుకు, కార్గిల్ యుద్ధంలో సాధించిన చిరస్మరణీయ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని గుంటూరు ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన మూడు రోజుల కార్గిల్ విజయ్‌దివస్ రజతోత్సవ ఫొటో ఎగ్జిబిషన్‌లో సమావేశమైన కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్‌లను ఉద్దేశించి వారు ప్రసంగించారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఏర్పాటుచేసిన ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన తర్వాత గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ 2047 నాటికి అభివృద్ధి పరంగా భారత్‌ను ప్రపంచంలో అగ్రస్థానానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకోవాలని కోరారు. యువత చిత్తశుద్ధితో కృషి చేస్తేనే ఉజ్వల లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. దేశం శాంతియుతంగా ఉండేందుకు సైనికులు ఎన్నో త్యాగాలు చేశారని ఆమె అన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు జీవిత పరీక్షల్లో విజయం సాధించేందుకు సన్నద్ధతను కొనసాగించాలన్నారు. చారిత్రక సంఘటనలు భవిష్యత్తు తరాలకు కొన్ని పాఠాలను మిగులుస్తాయన్నారు. విజయంలో క్రమశిక్షణ, సంసిద్ధత కీలకమని చెప్పారు. ఎమ్మెల్యేలు ఇద్దరూ ఎగ్జిబిషన్‌లో కార్గిల్ యుద్ధానికి సంబంధించిన వివిధ చిత్రాల వివరాలను తెలుసుకున్నారు. ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్ 1999లో అధిక ఎత్తులో జరిగిన కార్గిల్‌యుద్ధంలో సైన్యం ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారు. భారతదేశం తన ఆయుధాలను, యుద్ధ వ్యూహాలను ఆధునీకరించి తిరుగులేని శక్తిగా ఎదిగిందన్నారు.

పీఐబీ, సీబీసీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజిందర్‌చౌదరి సరైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడానికి సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చేపట్టిన వివిధ కార్యకలాపాలను వివరించారు. సవాళ్లను ఆత్మవిశ్వాసంతో స్వీకరించి, ఫలితాలను వినయంతో స్వీకరించాలని విద్యార్థులను చైతన్యపరిచారు. దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించడంలో సైనికులు చేసిన అత్యున్నత త్యాగాలను స్మరించుకునేందుకు సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సీబీసీ, అందరికీ అందుబాటులో ఉండేలా మూడు రోజుల ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వివిధ కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు దేశభక్తి నినాదాలతో ర్యాలీకి నాయకత్వం వహించగా, సీబీసీ ఫీల్డ్ ఆఫీసర్ ఆర్ రమేష్‌చంద్ర, ఎన్‌సీసీ అధికారి విజయ్ మోహితే జెండా ఊపి ప్రారంభించారు. సీబీసీ వివిధ కళాశాలల్లో కార్గిల్ విజయదివస్ సిల్వర్ జూబ్లీ థీమ్‌పై వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, డ్రాయింగ్ పోటీలను కూడా నిర్వహించింది.

దేవదాయశాఖ భూముల్లో నివాసముంటున్న పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

● పెదకాకాని మండలంలో ఎన్టీఆర్, ఏవీఎన్ కాలనీలో సుదీర్ఘకాలంగా నివాసం ఉంటున్న పేదలు

● అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల


అసెంబ్లీ సమావేశాల్లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదకాకాని, జూలై 26: దేవదాయశాఖ భూముల్లో నివాసముంటున్న పేదలకు ఇళ్లస్థలాలు మంజూరుచేయాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని పెదకాకాని మండలంలో ఎన్టీఆర్, ఏవీఎన్ కాలనీలో ఉన్నాయని తెలిపారు. ఎన్టీఆర్ కాలనీ పెదకాకానిలోని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంకు చెందిన భూమిని, ఏవీఎన్ కాలనీ ప్రకాశం జిల్లాలోని అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంకు చెందిన భూమి ఉందని తెలిపారు. ఈ రెండు కాలనీలు దేవదాయశాఖకు చెందినవి అని, అందులో సుమారు 30, 40 సంవత్సరాలు నుండి పేదలు ఇళ్ల నిర్మాణం చేపట్టి నివాసం ఉంటున్నారు. పేదలకు తగు న్యాయం చేయాలని కోరారు. ఆ రెండు కాలనీలలో గ్రామపంచాయతీ తరఫున వీధిలైట్లు, తాగునీరు, డ్రైనేజీ, అంగన్‌వాడీ కేంద్రాల వంటి అనేక మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. ప్రస్తుతం ఆ కాలనీలను తొలగించడం సాధ్యం కాదని, వారికి న్యాయం చేయాలన్నారు. ఆయా కాలనీలలో నివాసం ఉంటున్న పేదలకు ఒక రేటు నిర్ణయించి, వారికే ఇళ్లస్థలాలు మంజూరుచేయాలని కోరారు. ఆ దిశగా రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక జీవోని తీసుకొచ్చి రెవెన్యూలో నిషేధిత భూములను, పొలాలను పెద్దఎత్తున కాజేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో పేదలకు ఏమాత్రం న్యాయం జరగలేదని, ప్రభుత్వ పెద్దలు గద్దల్లాగా దోచుకున్నారన్నారు.

నీలి మీడియా ద్వారా ప్రజాధనాన్ని దోచుకున్న జగన్

● సభా సంఘం ద్వారా విచారణ జరిపించాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆనందబాబు


అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జూలై 26: రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసం చేయడంతో పాటు ప్రజాస్వామ్య విలువలను మంటగలిపి జగన్ ముఖ్యమంత్రిగా ఉండి ఐదేళ్ల కాలంలో నీలి మీడియా ద్వారా ప్రజాధనాన్ని దోచుకున్నారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీలో ఆయన గళం విప్పారు. అడ్డగోలుగా నీలి మీడియాకు ప్రజధనాన్ని దోచిపెట్టి దుర్వినియోగం చేశారన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా అనేది ఫోర్త్ ఎస్టేట్. మన రాష్ట్రంలో అలా కాకుండా జగన్ కోసం మీడియా లాగా వ్యవహరించారన్నారు. రాజశేఖరరెడ్డి అధికారంలో ఉండగా దానిని అడ్డం పెట్టుకుని క్విడ్ ప్రోకో ద్వారా వేల కోట్లు సంపాదించిన జగన్ ఒక్క రూపాయి పెట్టుబడి లేకుండా రూ.1250 కోట్లతో అదే మీడియా సామ్రాజ్యాన్ని ఏర్పాటుచేసుకున్నాడని, అదే సాక్షి మీడియా అన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత అదే క్విడ్ ప్రోకోను కొనసాగిస్తూ అదే సాక్షిని అడ్డాగా మార్చుకుని బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చుకున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రకటన ద్వారా తెలియజేసే సందర్భంలో గత ప్రభుత్వాలను విమర్శిస్తూ ప్రకటనలు ఇచ్చేవారని, ప్రభుత్వం వారు ఇచ్చిన వివరాల ప్రకారం గత ఐదేళ్లలో వార్తా పత్రికలకు ఇచ్చిన ప్రకటనల ఖర్చు రూ.850కోట్ల పైచిలుకు కాగా అందులో సాక్షి మీడియాకు 300 కోట్లు పైగానే ఖర్చు చేసినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. సర్క్యులేషన్ లేని ఇంగ్లీష్ పేపర్లకు ప్రకటనలు ఇచ్చి ఆ పేపర్ల ద్వారా జగన్‌కు అనుకూలంగా సర్వేలు ఇప్పించుకున్నాడని చెప్పారు. డిజిటల్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి రూ.120కోట్లు ఆ కార్పొరేషనుకు అప్పజెప్పారన్నారు. ఐడ్రీమ్ యూట్యూబ్ ఛానల్‌లో పనిచేసే వాసుదేవరెడ్డిని డిజిటల్ కార్పొరేషన్ ఎండీగా కూర్చోబెట్టి వాళ్లకు దోచిపెట్టి సాక్షి మీడియాలో పనిచేసే సిబ్బందికి కూడా ప్రభుత్వ సొమ్మునే జీతాలుగా చెల్లించారన్నారు. వీటన్నింటిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని, దీనిపై సభా సంఘాన్ని నియమించి ఐదేళ్ల కాలంలో జరిగిన దుర్వినియోగం వెలికి తీయాల్సిందిగా అసెంబ్లీ సాక్షిగా ఆధారాలు చూపుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

డేటా ప్రాసెసింగ్‌పై విస్తృత పరిశోధనలు అవసరం

● వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు


ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, జూలై 26: మన దేశం డేటా ప్రాసెసింగ్‌పై చేస్తున్న విస్తృత పరిశోధనలు మరింత వేగవంతం కావాలని ఏఎన్‌యూ ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ కే గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అనాల్గమేషన్ ఆఫ్ నావిగేషన్ ఎర్త్ అబ్జర్వేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీస్ అనే అంశంపై సాంకేతిక సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా వీసీ ప్రొఫెసర్ గంగాధరరావు మాట్లాడారు. ప్రపంచం మొత్తం డేటా ప్రాసెసింగ్‌పై పరిశోధనలు చేస్తున్నాయని, మన దేశం టెక్స్‌టైల్, మ్యానుఫ్యాక్చరింగ్, ఎన్వీపీ, జీపీయూ ప్రాసెసర్, మ్యానుఫ్యాక్చరింగ్ మీద దృష్టి సారించిందని అన్నారు. గణితశాస్త్ర నైపుణ్యం అందరూ పెంచుకోవాలని సూచించారు. సెమినార్ డైరెక్టర్ ఆచార్య పి.సిద్దయ్య మాట్లాడుతూ సాంకేతికతలను మెరుగుపరిచి సమ్మేళనం చేయడం ద్వారా ఒక ఆచరణార్థమైన వ్యవస్థ సామర్థ్యం పెరుగుతుందన్నారు. బి.ఈ.ఎల్ జనరల్ మేనేజర్ డాక్టర్ సీహెచ్ విశ్వనాథన్ మాట్లాడుతూ పరిశ్రమలు ఆశిస్తున్న నైపుణ్యం విద్యార్థులు పొందాలంటే హార్డ్‌వేర్ టెక్నాలజీలో వస్తున్న మార్పులపై దృష్టి సారించాలన్నారు. వీఎస్ఎల్ఐ కోర్ టెక్నాలజీపై సాధన చేసి మెలకువలు పెంచుకోవాలని సూచించారు. బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కొరకు బీఈఎల్‌లో అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఎఫ్‌ట్రానిక్స్ అధిపతి డి. రామకృష్ణ మాట్లాడుతూ డిజిటల్ అల్గారిథం డెవలప్‌మెంట్, గణిత శాస్త్ర ప్రావీణ్యం భవిష్యత్తును అంచనా వేయగల స్మార్ట్ సిస్టమ్స్ మీద అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎఫ్‌ట్రానిక్స్ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ కల్పిస్తామని సూచించారు. గౌరవ అతిథి ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ ఈ. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వివిధ దేశాల శాటిలైట్ సిస్టం, రిసెప్షన్ డేటా ఎనాలిసిస్ చేసే సాంకేతికతలను పుస్తకపఠనం మీద మాత్రమే ఆధారపడకుండా పోటీపడి నేర్చుకోవాలన్నారు. పి.రాఘవేంద్రరావు అడ్వాన్స్ నావిగేషన్ గైడ్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్ ఫర్ మిస్సైల్స్ స్పెక్ట్రమ్ అనే అంశంపై ప్రసంగించారు. ఈ సదస్సుకు వివిధ కళాశాల నుంచి 300మంది హాజరయ్యారు. సదస్సులో ఇన్‌ఛార్జి రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఓఎస్‌డీ ప్రొఫెసర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకుంటపై మరలా కబ్జాదారుల కన్ను

● విలువైన భూమి స్వాహాకు యత్నం ● నోట్ల మత్తులో రెవెన్యూ అధికారులు


ఎర్రకుంట భూమిని పూడ్చడానికి తోలిన మట్టి కుప్పలు, గతంలో ఎర్రకుంటను మట్టితో పూడ్చి కబ్జా చేసిన కొంత భూమి

కారంపూడి, జూలై 26: కారంపూడి-వినుకొండ రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకు పక్కన దశాబ్దాల కాలంగా ఎర్రకుంట భూమి ఉంది. ఈ కుంటలో పశువులు, మేకలు, ఆవులు దాహార్తిని తీర్చుకుంటాయి. వేసవి కాలంలో సైతం ఈ కుంట నీరు అన్ని జీవాలకు తాగునీటిని అందిస్తుంది. కారంపూడిలోని సర్వే నం.772/3లో 4.82 ఎకరాల కుంట భూమి ఉంది. ఈ భూమిపై గత జనవరిలో అప్పటి అధికారపార్టీ వైసీపీ నేతల కన్ను పడింది. కొద్దికొద్దిగా పూడ్చుకుంటూ మట్టితోలి చదును చేశారు. అప్పుడు పత్రికలన్నీ ఈ కబ్జాను వెలుగులోకి తేవడంతో తప్పని పరిస్థితుల్లో రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పెట్టారు. మరలా దీనిపై కబ్జాదారుల కన్ను పడింది. బోర్డును పీకిపారేసి కుంటను పూడ్చడానికి మట్టిని తోలిస్తున్నారు. రహదారి పక్కనే ఉన్న ఈ భూమికి మంచి గిరాకీ ఉంది. దీనిని కబ్జా చేసి సొంతం చేసుకోవాలనే ఆశ కబ్జాదారుల్లో మొదలైంది. దీనిలో కొంత భాగాన్ని సరిహద్దు పొలాల వారు కలిపేసుకున్నారు. ఈ ప్రాంతంలోనే పెట్రోల్ బంకు ఏర్పాటవడంతో భూమికి ధర పెరిగింది. రెవెన్యూ శాఖ దీనిపై మరలా దృష్టి సారించి కొలతలు వేసి భూమి చుట్టూ పెన్సింగ్ వేసి కుంటభూమి మనుగడను కాపాడి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుద్యోగ భృతికి వయోపరిమితి 45 సంవత్సరాలకు పెంచాలి

● ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు



మాట్లాడుతున్న పరుచూరి రాజేంద్రబాబు, పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), జూలై 26: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి ఎటువంటి ఆంక్షలు లేకుండా రూ.3వేలు ఇవ్వాలని, కనీస వయోపరిమితి 35 నుంచి 45 సంవత్సరాలకు పెంచాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం గుంటూరు, మల్లయ్య లింగంభవన్‌లో జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్రబాబు మాట్లాడుతూ యువనేస్తం పథకం కుటుంబంలో ఎవరికైనా పెన్షన్ వస్తే ఇవ్వమని, కనీస ఆదాయం రూ.10వేలకు మించి ఉండకూడదని, గ్రామీణ ప్రాంతాల్లో ఐదు ఎకరాల కంటే సాగు భూమి ఉండకూడదని, పట్టణ ప్రాంతాలలో 1500 చదరపు అడుగుల నివాస స్థలం ఉండకూడదనే షరతులను పెట్టడం సరికాదన్నారు. డీఎస్సీని పాత పద్ధతిలోనే నిర్వహించాలన్నారు. నూతన విధానం ఆన్‌లైన్లో నిర్వహించడం వలన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, పరీక్షను ఆఫ్‌లైన్‌లోనే నిర్వహించాలన్నారు. సమావేశంలో నాయకులు షేక్ వలి, చల్లా మరిదాసు, జాలాది, నవీన్ బిల్లా రాజేష్, నాసర్‌జీ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా - గుంటూరు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియ ప్రారంభం

● ఓటర్ల జాబితాల రూపకల్పనకు షెడ్యూల్ విడుదల ● వచ్చే ఏడాది మార్చి 29వ తేదీతో ముగియనున్న పదవీకాలం

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ప్రక్రియ ప్రారంభమైంది. జాతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వచ్చే ఏడాది మార్చిలో జరగబోయే ఈ ఎన్నిక కోసం తాజా ఓటర్ జాబితాలను సిద్ధం చేయాల్సి ఉంది. ఆ మేరకు చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్ యాదవ్ శుక్రవారం ఓటర్ జాబితాల రూపకల్పనకు షెడ్యూల్‌ని ప్రకటించారు. ఈ ఏడాది నవంబరు 1వ తేదీ నాటికి ఎవరైతే పట్టభద్రులు ఉంటారో వారు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ నమోదు చేయడం అనేది ఓటరు ఇష్టం.

- సెప్టెంబరు 30వ తేదీన ఓటర్ జాబితాల రూపకల్పనకు నోటిఫికేషన్‌ని విడుదల చేస్తారు.
- అక్టోబరు 16న మరోసారి రీపబ్లికేషన్ చేస్తారు.
- అక్టోబరు 25న రెండో రీపబ్లికేషన్ చేస్తారు.
- నవంబరు 6వ తేదీ వరకు ఫారం-18, 19లో దరఖాస్తులు స్వీకరిస్తారు.
- నవంబరు 20వ తేదీ లోపు ముసాయిదా ఓటర్ల జాబితాలను ముద్రిస్తారు.
- నవంబరు 23వ తేదీన ముసాయిదా ఓటర్ జాబితాలు ప్రకటిస్తారు.
- నవంబరు 23 నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేసేందుకు అవకాశం కల్పిస్తారు.
- డిసెంబరు 25వ తేదీన క్లెయిమ్‌లు, అభ్యంతరాలు పరిష్కరించి సప్లిమెంట్ ఓటర్ జాబితాలను ముద్రిస్తారు.
- డిసెంబరు 30వ తేదీన తుది ఓటర్ల జాబితాని ప్రచురిస్తారు.

తల్లీబిడ్డలను కలిపిన 'ఆధార్'

● చిన్నతనంలో తప్పిపోయిన మానసిక దివ్యాంగులు

● పదేళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు..


ఆశ్రమంలో తల్లిదండ్రులతో కోటప్పకొండ గ్రామానికి చెందిన రాజు, ఇమాన్యుయేల్

శివ్వంపేట, జూలై 26: ఆ ముగ్గురి మానసిక స్థితి సరిగ్గా లేదు. ఇందులో ఇద్దరు సోదరులు 12 క్రితం, మరొకరు 9 ఏళ్ల క్రితం తప్పిపోయారు. ముగ్గురూ మెదక్ జిల్లా శివ్వంపేట మండలం మగ్దుంపూర్ గ్రామం లోని సజీవ ర్గీస్ నెలకొల్పిన బేతాని సంరక్షణ అనాథాశ్రమంలో ఆశ్రయం పొందుతున్నారు. వారికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయించేందుకు ఆశ్రమ నిర్వాహకులు తీసుకెళ్లగా.. వారు అనాథలు కారు. వారికోసం అప్పటినుంచి కుటుంబసభ్యులు వెతుకుతూనే ఉన్నారని తేలింది. తమ బిడ్డలు క్షేమంగా ఉన్నారని తెలుసుకుని వారు ఆనందపడి తమ పిల్లలను తీసుకెళ్లా రు. వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా నరసరావుపేట మండలం కోటప్పకొండ గ్రామానికి చెందిన దాసరి నాగేంద్ర, శీను దంపతులు ఎల్బీనగర్‌లో ఉంటూ వెంట్రుకల వ్యాపారం చేస్తుంటారు. వారికి ఇద్దరు మానసిక దివ్యాంగులైన కుమారులు రాజు (13), ఇమ్మానియేల్(9) ఉన్నారు. 12 ఏళ్ల క్రితం రాజు మారం చేస్తుండటంతో తల్లి డబ్బులు ఇచ్చి కిరాణా షాపులో కొనుక్కోమని పంపించింది. అప్పుడు తప్పిపోయిన రాజు, ఇమ్మానియేల్ అటుఇటు తిరిగి బేతాని సంరక్షణ ఆశ్రమానికి చేరారు. అప్పటినుంచి అక్కడే ఉంటున్నారు. మానసిక దివ్యాంగుల పథకం పొందేందుకు ఆశ్రమ నిర్వాహకులు వారి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయించాలని ప్రయత్నించారు. అయితే, ఆధార్ రిజక్ట్ అయింది. ఆరా తీయగా, వారిపేరిట ఎక్కడో ఆధార్ నమోదైఉన్నట్లు తేలింది. వీరి ఆచూకీ కోసం ప్రయత్నించగా, తల్లిదండ్రుల చిరు నామా దొరికింది. వారికి సమాచారం ఇవ్వగా వారు శుక్రవారం ఆశ్రమా నికి వచ్చి తమ బిడ్డలను అక్కున చేర్చుకున్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ వీరబాబు, ఆశ్రమం క్యాంప్ ఇన్‌ఛార్జి విన్సెంట్, సిస్టర్ కార్మాల్ ఉన్నారు.

రూ.3.36 లక్షల పురుగుమందుల అమ్మకాలు నిలిపివేత

గుంటూరు సిటీ, జూలై 26: గుంటూరులోని ఏటుకూరు రోడ్డులో ఉన్న పురుగుమందుల గిడ్డంగుల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ తనిఖీలలో ఆగ్రో సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి చెందిన కూల్‌స్టార్ అనే పురుగుమందులను స్టాక్ బోర్డునందు, స్టాక్ రిజిస్టర్ నందు వివరాలు సరిగా నమోదు చేయకుండా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. వ్యవసాయశాఖ అనుమతులు లేకుండా ఈ పురుగుమందులను అమ్ముచున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. రూ.3,36,300 విలువైన 100 లీటర్ల పురుగుమందు అమ్మకాలు నిలిపివేస్తూ ఆదేశాలు జారీచేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయ అధికారి ఖడ్గం రమణకుమార్, స్థానిక వ్యవసాయ అధికారి బీ గౌతంప్రసన్న పాల్గొన్నారు.


ఏటుకూరు రోడ్డులోని పురుగుమందుల గిడ్డంగుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పెదకాకానిలో యువకుడు ఆత్మహత్య

పెదకాకాని, జూలై 26: పెదకాకానిలోని వడ్డెరకాలనీలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... వడ్డెరకాలనీకి చెందిన వేముల చిట్టిబాబు(24) ట్రాక్టర్ డ్రైవర్. ఇతనికి భార్య, ఏడాది వయసుగల కుమారుడు ఉన్నాడు. ఇటీవల స్థానిక యువతితో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న చిట్టిబాబు భార్య ఆ మహిళతో ఘర్షణ పడింది. ఇరువురు కొట్టుకున్నారు. ఈ వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. దీంతో చిట్టిబాబు భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని చిట్టిబాబు చనిపోయాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. వివాహేతర సంబంధమే మృతుడి ఆత్మహత్యకు కారణం అని పోలీసులు భావిస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

29,453 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 26,896 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 29,453 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 11,210 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	15500
నెంబరు.5	9000	12200
273	11000	11600
341	8500	13500
4884	--	--
సూపర్ 10	15000	15000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18500
బ్యాడిగి	8000	15000
దేవనూరుడీలక్స్	8500	11000
తెల్లకాయలు	4500	12000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8500	14500
నెంబరు. 5	10000	16000
273	12000	12000
341	8500	13500
4884	11800	16000
సూపర్ 10	--	--
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8500	18000
బ్యాడిగి	9000	13000
దేవనూరుడీలక్స్	9000	13000
తెల్లకాయలు	5000	11000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



చుట్టుగుంట రైతుబజార్‌ని సందర్శిస్తున్న జేసీ భార్గవ తేజ

జేసీ భార్గవ తేజ క్షేత్ర పర్యటనలకు శ్రీకారం

● ఒకే రోజు రైతుబజార్, ఇసుక రీచ్, ఎంఎల్ఎస్ పాయింట్ల సందర్శన

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అమిలినేని భార్గవ తేజ క్షేత్ర పర్యటనలకు శ్రీకారం చుట్టారు. ఆయన శుక్రవారం ఉదయం మార్కెటింగ్ శాఖ ఏడీ రాజబాబుతో కలిసి తొలుత చుట్టుగుంటలోని రైతుబజార్‌ని సందర్శించారు. రైతుబజార్‌లో కూరగాయల లభ్యత, ఎక్కడి నుంచి వాటిని తీసుకొస్తున్నారో రైతులు, డ్వాక్రా సంఘాల మహిళలను అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం కూరగాయలు విక్రయిస్తున్నారా లేదా అనేది వినియోగదారులతో మాట్లాడి తెలుసుకొన్నారు. రైతుబజారు పరిసరాలు శుభ్రంగా ఉంచాలన్నారు. రైతుబజార్‌లో పౌరసరఫరాల శాఖ ఏర్పాటు చేయించిన ప్రత్యేక కందిపప్పు, బియ్యం విక్రయ కేంద్రాన్ని పరిశీలించారు. కందిపప్పు, బియ్యం నాణ్యతని తనిఖీ చేశారు. ఆదివారం కూడా షాపు తెరిచే ఉంచాలని స్పష్టం చేశారు.

అనంతరం కొల్లిపర, మున్నంగి, గుండిమెడలోని ఇసుక రీచ్‌లను జేసీ భార్గవ తేజ సందర్శించారు. ఇసుక సరఫరా ఏ విధంగా జరుగుతున్నదో పరిశీలించారు. ఇసుక కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా ఉచితంగా సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాలను రూపొందించింద న్నారు. ఆ మేరకు సజావుగా ప్రజలకు అవసరమైన ఇసుకని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాలలోని ఎంఎల్ఎస్ పాయింట్లను సందర్శించారు. రేషన్ దుకాణాలకు తూకం ప్రకారం బియ్యం పంపిణీ చేస్తున్నారో లేదో తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు వచ్చిన స్టాకు, పంపిణీ చేసింది వంటి వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ అధికారి, డిప్యూటీ తహసీల్దారు, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

జవాన్ల ప్రాణ త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యం

● విజయ్ దివస్ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి



అమర్ జవాన్ స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు సిటీ, జూలై 26 : వీర జవాన్ల ప్రాణ త్యాగాలను, బలిదానాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యం అని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. గుంటూరులోని సైనిక సంక్షేమ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన కార్గిల్ విజయ్ దివస్ 25వ వార్షిక కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని అమర్ జవాన్ స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి, రెండు నిమిషాలు మౌనం పాటించి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ గుంటూరు ఉమ్మడి జిల్లాలో 52 మంది కార్గిల్ యుద్ధంతో పాటు అంతకు ముందు జరిగిన యుద్ధాల్లో వీరగతిని పొందారన్నారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో మరణించిన సైనికుల గౌరవార్థం వారి కుటుంబ సభ్యులకు శాలువ కప్పి మెమెంటో అందించి సత్కరించారు. అలాగే యుద్ధంలో జిల్లాకు సంబంధించి వీరగతి పొందిన సైనికుల కుటుంబ సభ్యులతో పాటు, సైన్యంలో పదవీ విరమణ పొందిన సైనికులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారిణి గుణశీల, డైరెక్టర్ ఆఫ్ సైనిక్ వెల్ఫేర్ బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి, పంచాయితీరాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ గుబ్బం బ్రహ్మయ్య, గుంటూరు తూర్పు మండల తహసీల్దార్ నగేష్, రిటైర్డ్ సైనికులు, సైనిక సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్ వికాస్ భవన్‌లో మూడో కంట్రోల్ బోర్డు ప్రారంభం



మూడో కంట్రోల్ బోర్డుని ప్రారంభిస్తున్న డీఆర్ఎం రామకృష్ణ

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా గుంటూరు రైల్ వికాస్ భవన్‌లో మూడో కంట్రోల్ బోర్డుని డీఆర్ఎం ఎం.రామకృష్ణ ప్రారంభించారు. శుక్రవారం ఉదయం ఆయన ఆపరేటింగ్ అధికారులతో కలిసి మునుమాక-నంద్యాల, శావల్యాపురం-న్యూ పిడుగురాళ్ల, గుండ్లకమ్మ - దర్శి సెక్షన్ల కంట్రోల్ బోర్డుని ఆయన ప్రారంభించారు. డీఆర్ఎం మాట్లాడుతూ ఈ కంట్రోల్ బోర్డుని కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికులకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మొదటి అంతస్తులో సిగ్నల్ కంట్రోల్ రూంని కూడా ప్రారంభించారు. ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ బీ నాగ్య శుక్రవారం గుంటూరు డివిజన్‌లో భద్రతకు సంబంధించిన అంశాలపై ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం కే.సైమన్, సీనియర్ డీవోఎం ఎం.దినేష్‌కుమార్, సీనియర్ డీఎస్‌టీఈ బీ.లక్ష్మణ్, సీనియర్ డీఈఎన్ (కోఆర్డినేషన్) జేవీ అనూష తదితరులు పాల్గొన్నారు.

యూటీఎస్ యాప్‌లో టిక్కెట్లు బుకింగ్ చేయొచ్చు : డీఆర్ఎం

యూటీఎస్ యాప్‌ని వినియోగించి ఎక్కడి నుంచైనా జనరల్, ప్లాట్‌ఫాం, సీజన్ టిక్కెట్లను బుకింగ్ చేసుకోవచ్చని డీఆర్ఎం ఎం.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వేస్టేషన్ నుంచి ఐదు మీటర్లు దాటిన తర్వాత నుంచి ఈ సదుపాయాన్ని స్మార్ట్‌ఫోన్లలో వినియోగించుకోవచ్చన్నారు. గతంలో సబర్బన్‌లో 20 కిలోమీటర్లు, నాన్‌సబర్బన్‌లో 50 కిలోమీటర్ల వరకు టిక్కెట్ల బుకింగ్ చేసుకొనే పరిమితి ఉండేదన్నారు. ఇప్పుడు దూరంలో ఎలాంటి పరిమితి లేదన్నారు. కాగిత రహిత ప్రయాణాలను ప్రోత్సహించేందుకు రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకొందని చెప్పారు. టిక్కెట్లు బుకింగ్ చేసుకోవడానికి ఆర్-వాలెట్‌ని రీఛార్జ్ చేసిన ప్రతీసారి 3 శాతం బోనస్ వస్తుందన్నారు. యూటీఎస్ యాప్ వలన రైల్వేస్టేషన్లలో టిక్కెట్ కౌంటర్ల వద్ద క్యూలైన్లలో వేచి ఉండాల్సిన అవసరం ఉండదన్నారు.

21 మంది తహసీల్దార్లు వెనక్కు

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణ కోసం ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి గుంటూరుకు వచ్చిన 21 మంది తహసీల్దార్లను కలెక్టర్ నాగలక్ష్మి వారి సొంత జిల్లాలకు వెనక్కు పంపించారు. సీసీఎల్ఏ జయలక్ష్మి ఆదేశాల మేరకు శుక్రవారం వారిని రిలీవింగ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తాడికొండ తహసీల్దార్ పీ.మధుసూదనరావు, కే వెంకటేశ్వ రరావు(మంగళగిరి), కే.రవిబాబు(దుగ్గిరాల), పీ.పార్వతి(కాకుమాను), టీ.శ్రీనివాసులు (వట్టిచెరుకూరు), కే.రవీంద్రరెడ్డి(గుంటూరు పశ్చిమ)లను పూర్వపు ప్రకాశం జిల్లాకు పంపించారు. అలానే వీ.సుధీర్(తుళ్లూరు), జీ.రాఘవేంద్రరావు(ఫిరంగిపురం), కే.రాజ్యలక్ష్మి(మేడికొండూరు), టీ.విజయకుమార్(తాడేపల్లి), ఆర్.సూర్యనారాయణ సింగ్(పొన్నూరు), ఈ రమాదేవి (చేబ్రోలు), ఎస్.శ్రీనివాసులురెడ్డి(తెనాలి), ఎన్ శ్రీనివాసులు(కొల్లిపర), ఎం.పద్మజ(ప్రత్తిపాడు), డీ.లాజరస్(పెదనందిపాడు), టీ.విజయకుమార్ (ఏవో), పీ.శాంతకుమారి (మెజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్), ఎం నిరంజన్(డీఏవో, గుంటూరు ఆర్‌డీవో), కే జయజయరావు(డీఏవో, తెనాలి సబ్ కలెక్టర్ ఆఫీసు)లను పూర్వ నెల్లూరు జిల్లాకు పంపించారు. ఎన్నికల విధుల కోసం ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు కూడా అక్కడ రిలీవింగ్ అయి శని/సోమవారాల్లో కలెక్టరేట్‌కు వచ్చి రిపోర్టు చేయనున్నారు. వారికి కలెక్టర్ పోస్టింగ్‌లు కల్పిస్తారు. అప్పటి వరకు డిప్యూటీ తహసీల్దార్లకు ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ బాధ్యతలు కల్పించారు.

గడవు ముగిసినా కొనసాగుతున్న పెదకాకాని తహసీల్దార్

ఏపీ సచివాలయం నుంచి 2022లో రెండేళ్ల సర్వీసు నిమిత్తం వచ్చిన తహసీల్దార్ రత్నం పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీతో ముగిసింది. అయినప్పటికీ ఆయన్ని అప్పటి కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి రిలీవింగ్ చేయలేదు. దాంతో నేటికీ పెదకాకాని తహసీల్దార్‌గా రత్నం కొనసాగుతున్నారు. ఇప్పుడు వేరే జిల్లాలకు వెళ్లిన ఇక్కడి తహసీల్దార్లు వెనక్కు వచ్చేయడంతో వారికి పోస్టింగ్‌లు కేటాయించే విషయంలో సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నది.

కేంద్ర బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు కోత సరికాదు

గుంటూరు(తూర్పు), జూలై 26 : కేంద్ర బడ్జెట్లో ఐసీడీఎస్‌కు నిధుల కోత సరైనదికాదని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ అన్నారు. పాతగుంటూరు సీఐటీయూ కార్యాలయంలో 42 రోజుల అంగన్‌వాడీల సమ్మె పుస్తకావిష్కరణ, జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ నిధుల కోతను వ్యతిరేకిస్తూ ఆగస్టు తొలివారంలో నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో వై.నేతాజీ, కుమారి, సుకన్య, ప్రేమలత, విజయ్ కుమారి పాల్గొన్నారు.

ఇసుక లోడింగ్‌కు మాత్రమే ఛార్జీలు చెల్లించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు



పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్టాక్ పాయింట్ల నుంచి వినియోగదారులకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకను సరఫరా, కేవలం లోడింగ్(ఆపరేషన్)కు మాత్రమే నగదు వసూలు చేస్తుందనే విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించేలా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెలగపూడి సచివాలయం నుంచి రాష్ట్ర రెవెన్యూ (ఎక్సైజ్), ఇండస్ట్రీస్, కామర్స్ (మైన్స్) శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా ఇసుక సరఫరాపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ హాలు నుంచి కలెక్టర్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ భార్గవ్ తేజతో కలిసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్ అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ స్టాక్ యార్డుల నుంచి ఇసుకను వినియోగదారులకు సక్రమంగా సరఫరా అయ్యేలా సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలైన రోడ్లు, రైలు, విమాన సర్వీసు కనెక్టివిటీ ఉందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. దీని దృష్ట్యా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం కలక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ(డిఐఈపిసి) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అందిస్తున్న రాయితీలపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేలా పరిశ్రమల శాఖ అధికారులు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో పరిశ్రమల ప్రోత్సాహకాలకు సంబంధించి ఎంఎస్ఎంఈలకు చెందిన 162 క్లెయిమ్‌లకు రూ.8 కోట్ల 44 లక్షలను మంజూరు చేస్తూ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆమోదించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆర్.వెంకటేశ్వరరావు, పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ యుగంధర్, సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన రావు, ఏపీఐఐసి జోనల్ మేనేజర్ జీవన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ యం నారాయణ, డిప్యూటీ లేబర్ కమిషనర్ గాయత్రి దేవి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సుభాని, భూగర్భ జల వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ వందనం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి, డీటీసీ కరీం, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆర్.మహిపాల్‌రెడ్డి, ఎస్సీ ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ రీజనల్ ప్రెసిడెంట్ పరిమళ, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల చెక్‌లిస్టులు తయారు చేయాలి

జిల్లాలోని స్కానింగ్ సెంటర్ల చెక్‌లిస్టులు తయారు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిరోధక చట్టంపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు నమోదవుతున్న తుళ్లూరు మండలంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీని ఆదేశించారు. మూడవ అదనపు జిల్లా జడ్జి వీఏఎల్ సత్యవతి మాట్లాడుతూ బాల్య వివాహాలపై అవగాహనకు జిల్లా న్యాయ సేవా సంస్థ సహకారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, సీడ్స్ సంస్థ అధినేత రోషన్‌కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ రామారావు, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి, అధికారులు ఎన్ వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, లీగల్ కన్సల్టెంట్ వాణి, ఆర్‌డీవో శ్రీకర్, మైనింగ్ ఏడీ చంద్రశేఖర్, జిల్లా ఉపరవాణా కమిషనర్ కరీం, జిల్లా భూగర్భ జలవనరుల శాఖ డీడీ వందనం, డీఆర్డీఏ పీడీ హరిహరనాధ్, రివర్ కన్జర్వేటర్ ఇరిగేషన్ డీఈ భానుబాబు పాల్గొన్నారు.

ఖజానా కార్యాలయంలో పెండింగ్ బిల్లులపై స్పందించాలి

గుంటూరు(తూర్పు), జూలై 26 : జిల్లా ఖజానా కార్యాలయంలో 15 రోజులుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులపై స్పందించి, పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఖజానా అధికారి బి.రాజగోపాలరావుకు వినతిపత్రం అందజేశారు. ఈనెల 15న పెట్టిన బిల్లులు ఇప్పటివరకు అప్రూవల్ కాకపోవడాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సిటిజన్ చార్ట్ ప్రకారం అన్ని లెవెల్స్ కలిపి 5 రోజులలో అప్రూవల్ కావాల్సి ఉండగా ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయని సంఘ నాయకులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా సమస్యను రాష్ట్ర ఫైనాన్స్ అధికారి పీయూష్ కుమార్‌కి ఈ మెయిల్ ద్వారా పంపనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి శివారెడ్డి తెలిపారు. యూనియన్ నాయకులు కరీముల్లా షాఖాదరి, నాగేశ్వరరావు, మురళి తదితరులు ఉన్నారు.

స్పేస్ క్విజ్, ఎగ్జిబిషన్‌లో సత్తాచాటిన బాసర విద్యార్థులు

గుంటూరు(విద్య), జూలై 26 : సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్) శ్రీహరికోట ఆధ్వర్యంలో ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన స్పేస్ ఎగ్జిబిషన్, స్పేస్ క్విజ్‌లో బాసర కాన్సెప్ట్ స్కూల్, నల్లపాడు విద్యార్థులు బహుమతులు సాధించారని సంస్థల చైర్మన్, డైరెక్టర్ సాదినేని మురళీమోహనరావు, సాదినేని రాధిక శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ పాఠశాల విద్యార్థులు ఎస్‌కే సాధిక మొదటి స్థానం, ఎస్‌కే సమీర్ రెండవ స్థానం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

డిగ్రీ ఫలితాల్లో శ్రీ మేధ, కెరీర్ డిగ్రీ కాలేజి విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), జూలై 26 : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో బీకాం జనరల్, బీకాం కంప్యూటర్స్ కోర్సులోని విద్యార్థులు అత్యధిక మార్కులతో పాటు అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించారని సంస్థ డైరెక్టర్లు శేష సాయిబాబు, సి.ఎ అన్నా నందకిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీకాం జనరల్ విభాగంలో ఒలివ్ గ్లోరియానా 619 మార్కులు, ఎస్‌కె సుమయా 612, జె.మౌనికసృజన 599, రితికకుమారి 584, వి.నరేష్ 582 మార్కులు సాధించారని తెలిపారు. బీకాం కంప్యూటర్స్‌లో బి.పారోనికా 714, పి.ఆర్షియా 678, ఎ.మహేశ్వరి 658, ఎన్.స్తుతి హర్షిత 654, ఎస్‌కే ర్కుబాహుసైన్ 646 మార్కులు సాధించారని తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న అన్నా నందకిషోర్

ఉత్తమ విలువలు, దేశభక్తితో ఉండటం కూడా దేశసేవే

● సైనిక సేవా బోర్డు డైరెక్టర్ వెంకటరెడ్డి

గుంటూరు(విద్య), జూలై 26 : దేశ సేవ చేయడం అంటే సైన్యంలో చేరడం మాత్రమే కాదని, ఉత్తమ విలువలు, దేశభక్తితో ఉండటం కూడా దేశసేవలో భాగమేనని సైనిక బోర్డు డైరెక్టర్ వి.వెంకటరెడ్డి అన్నారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో శుక్రవారం జరిగిన విజయదివస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే నైతిక విలువల్ని, తల్లిదండ్రుల్ని గౌరవించేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా అమర సైనికులకు విద్యార్థులు, కోరుకొండ సైనిక స్కూల్ మాజీ విద్యార్థిని శ్రీరెడ్డి, పాఠశాల కార్యదర్శి పి.రామచంద్రరాజు తదితరులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ హేమాంబ, హెచ్ఎం కృష్ణఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు(విద్య), జూలై 26 : యువత దేశభక్తి భావాలను పెంపొందించుకోవాలని సుబేదార్ మేజర్ విజయ్ మహతి అన్నారు. స్థానిక టీజేపీఎస్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన విజయ దివస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. విజయ్ మహతి మాట్లాడుతూ ఎన్నో జన్మల పుణ్యం చేసుకుంటేనే జవాన్‌గా ఉద్యోగం చేసే అవకాశం వస్తుందని, అంతేకాకుండా దేశ రక్షణలో వచ్చే ఆత్మసంతృప్తి మరెక్కడా రాదని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మనోహర్, కార్యదర్శి కేవీ బ్రహ్మం, కళాశాల ఎన్‌సీసీ అధికారి మేజర్ పి.కుమార్ రాజా, ఎన్ఎస్ఎస్ అధికారి ఆర్.జయ శైలజ తదితరులు పాల్గొన్నారు.


● గుంటూరు, జూలై 26: భారత సైనికుల పరాక్రమానికి కార్గిల్ యుద్ధం స్ఫూర్తిదాయకమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ వీరోచిత పోరాటంతో కార్గిల్ యుద్ధం గెలిచిన ఈ రోజు ప్రతి భారతీయు డు గర్వించాల్సిన రోజని అన్నారు. కార్యక్రమంలో మల్లేశ్వరరావు, జమదగ్ని, కె.మురళీకృష్ణ, న్యాయవాది హరి, ఎన్.సదాశివం పాల్గొన్నారు.

ఐఐటీ విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేత

గుంటూరు(తూర్పు), జూలై 26 : ఖరగ్‌పూర్ ఐఐటీలో బీటెక్ చదువుతున్న నగరానికి చెందిన వడ్డవల్లి సుజితకు నంబూరు వసంతకుమారి రూ.70 వేల ఆర్థికసాయం అందజేశారు. ఉన్నత చదువుతో పాటు సమాజంలో విలువల కలిగి, మంచి వ్యక్తిత్వంతో రాణించాలని విద్యార్థినికి ఆమె సూచించారు. కమ్మజన సేవా సమితి పాలకవర్గ సభ్యులు ఘంటా పున్నారావు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా విద్యార్థినికి ఫీజు రూపంలో వసంత కుమారి సాయం చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా 4వ సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫీజును అందజేశారని వివరించారు. కార్యక్రమంలో కేజేఎస్ఎస్ మేనేజర్ చావ్లా బోసు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రద్దు చేసిన గిరిజన సంక్షేమ పథకాలు పునరుద్ధరించండి

● సీఎం చంద్రబాబుకు ధారూనాయక్ వినతి



సీఎం చంద్రబాబుకు గిరిజన సమస్యలు వివరిస్తున్న ధారూనాయక్

గుంటూరు, జూలై 26 : వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన 16 గిరిజన సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరించాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూనాయక్ కోరారు. ఆయన శుక్రవారం టీడీపీ అధినేత చంద్రబాబును కలసి రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులు అన్ని రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో జరిగిన అవినీతిపైన విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సానుకూలంగా స్పందించిన చంద్రబాబు అయా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


ప్రకృతి వ్యవసాయం పై జిల్లా స్థాయి లో సమీక్ష

గుంటూరు సిటీ, జూలై 26 : గుంటూరు జిల్లా ప్రకృతి వ్యవసాయం కార్యక్రమంలో పని చేస్తున్న క్షేత్ర స్థాయి సిబ్బందికి శుక్రవారం కృషి భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ పంటల సాగు ముమ్మరం అయినందున ఈ సంవత్సరం చేయబోయే కార్యక్రమాలైన పీఎండీఎస్, కంపాక్ట్ బ్లాక్‌లు, ఎస్2ఐఎస్ రైతుల గుర్తింపు, హోస్ట్ ఫార్మర్‌ల గుర్తింపు, ఆ గ్రేడ్ మోడల్లు, వాటి ప్రగతి పై సమీక్ష జరిపారు. రాష్ట్ర కార్యాలయం నుంచి జిల్లా యాంకర్ గోపి చందు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి ఈ సమీక్ష నిర్వహించారు. ప్రతి సిబ్బంది ప్రకృతి వ్యవసాయంలో నిబద్ధతతో పని చేసి రైతులందరికి ప్రకృతి వ్యవసాయంపై పూర్తి స్థాయిలో అవగాహనా కల్పించి, రసాయన రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా మార్చాలని, ప్రకృతి వ్యవసాయంలో నిర్దేశించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ ఎంపీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉ.సా. ఆశయాల సాధనే ఆయనకు నిజమైన నివాళి

గుంటూరు, జూలై 26 : బహుజన ఉద్యమ నాయకుడు, దివంగత ఉప్పుమాములూరి సాంబశివరావు (ఉ.సా) ఆశయాలు సాధించటమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అవుతుందని ఆంధ్రప్రదేశ్ రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు అన్నారు. గుంటూరు టౌన్ రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో బహుజన ఉద్యమ నాయకుడు ఉ.సా నాలుగో వర్ధంతి కార్యక్రమం పాతగుంటూరులోని గంగానమ్మ కమ్యూనిటీ హాల్ శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉసా పేద వర్గాల రాజ్యాధికారం కోసం పోరాటం చేసిన గొప్ప నాయకుడని కీర్తించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఈమని ఉమామహేశ్వరరావు, లింగాల బిక్షం, వట్టికూటి సాంబయ్య, పిడుగురాళ్ల సురేష్ బాబు, నిడుముక్కల రాంబాబు, నరసింహరావు, షేక్ ఖాజా ఆసిఫ్, నీలం సాంబయ్య, గుంటుపల్లి సుధా, వలివేటి శ్రీనివాసరావు తదితరులున్నారు.

భవిష్యత్ మెకానికల్, సివిల్ రంగాలదే : గోపికృష్ణ



గోపికృష్ణను సత్కరిస్తున్న అధ్యాపకులు

గుంటూరు(విద్య), జూలై 26 : రానున్న కాలంలో ఆటోమేషన్ రంగం లోని మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ రంగాల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని షార్ (శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్) మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ గ్రూప్ డైరెక్టర్ పీ.గోపికృష్ణ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జరిగిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో ఆయన మాట్లా డారు. గోపికృష్ణ మాట్లాడుతూ మెకట్రానిక్స్, రోబోటిక్స్,స్పేస్ క్రాఫ్ట్ డిజైన్ లో గల ఉన్నత సాంకేతిక నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. కోర్ ఇంజనీరింగ్,స్పేస్ టెక్నాలజీ రంగాలలో గల ఉద్యోగావకాశాలను విద్యార్థు లతో పంచుకున్నారు. తయారీ రంగంలో మిగిలిన ప్రపంచ దేశాలు ప్రస్తు తం వెనుకంజలో ఉన్నాయని, మన దేశం తయారీ రంగంలో అగ్రగామిగా నిలవడానికి ఇదే సరైన సమయమన్నారు. రాబోయే రోజుల్లో రోబోటిక్స్ ప్రొడక్ట్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్, మెడికల్ ఇనుస్ట్రుమెంటేషన్ కీలకంగా మారనున్నాయన్నారు. విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్వీఆర్ అండ్ జేసీలో ఉత్సాహంగా వీడ్కోలు వేడుకలు

గుంటూరు(విద్య), జూలై 26 : కళాశాల జీవితం విద్యార్థులకు మధుర జ్ఞాపకాలను నింపే విధంగా ఉండాలని ఆర్వీఆర్అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ శుక్రవారం అన్నారు. చౌడవరంలోని కళాశాలలో చివరి సంవత్సరం చదువు పూర్తి చేసుకొని విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులు జీవితంలో ఒక మైలురాయిని దాటారని భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగ బాధ్యతలతో సమాజంలో ఉత్తమ పౌరులుగా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని, కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గుజ్జనగుండ్లలో సమస్యలకు త్వరలో పరిష్కారం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఎప్పటి నుంచో గుజ్జనగుండ్లలో తిష్ట వేసిన సమస్యలకు అతి త్వరలోనే స్వస్తి పలుకుతామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి స్పష్టం చేశారు. గుంటూరు 39వ డివిజన్ ఎస్‌వీఎన్ కాలనీ 4వ లైను నుంచి గుజ్జనగుండ్ల కరెంట్ ఆఫీస్ వరకు రూ.49 లక్షల అంచనాలతో సైడు డ్రెయిన్ల నిర్మాణానికి శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో తాను గుజ్జనగుండ్లను సమస్యలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దుతానని హామీనిచ్చానని, అందులో భాగంగా ఈ రోజు సైడు డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశానని చెప్పారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి కృషి చేస్తానని, గుజ్జనగుండ్ల పార్కు అభివృద్ధికి ఇప్పటికే ప్రణాళికలు రూపొందించానని, త్వరలోనే పనులు మొదలు పెట్టబోతున్నామని, అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్లను పూర్తి చేస్తానని మాధవి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సింగంశెట్టి వీరయ్య, రుస్తుం బాబు, వనమా నరేంద్ర, షేక్ రఫీ, పాకాలపాటి శ్రీకాంత్, జాన సుబ్బారావు, తిమ్మిశెట్టి శ్రీనివాసరావు, కరణం రామకృష్ణయ్య, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.



సైడు డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

వైనాట్ ప్రతిపక్ష హోదా అంటూ మారం చేస్తున్న జగన్

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వై నాట్ 175 అన్న నోటితోనే.. వై నాట్ ప్రతిపక్ష హోదా అంటూ జగన్ చిన్నపిల్లాడిలా మారం చేస్తున్నాడని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి ఆస్కార్ నటనను మెచ్చి 11 స్థానాలకు పరిమితం చేసినా ఆయనలో ఎటువంటి మార్పు రాకపోవటం సిగ్గుచేటని కనపర్తి విమర్శించారు. తనకు ప్రతిపక్ష హోదా కావాలని కోర్టులను అభ్యర్థించే స్థాయికి జగన్ దిగజారిపోయాడని ఎద్దేవా చేశారు. 'చంపాలంటే నన్ను చంపేయండి' అని మాట్లాడుతున్న జగన్ అమాయకపు మాటలు చూసి సొంత పార్టీ నేతలే నవ్వుకుంటున్నారని అన్నారు. ఆయన ఇకనైనా కోడికత్తి, గులకరాయి, గుండెపోటు లాంటి భారీ నాటకాలకు తెరదించాలన్నారు. అసెంబ్లీకి రావడానికి మొఖం చెల్లక ధర్నా పేరుతో ఢిల్లీలో కాలక్షేపం చేసిన పిరికిపంద జగన్ అని మండిపడ్డారు. జగన్ పాత కేసులతో పాటు, గత అయిదు సంవత్సరాల్లో ఆయన చేసిన ఆర్థిక, హత్యా నేరాలకు శాశ్వతంగా చంచల్ గూడా జైల్లో సేదతీరక తప్పదని కనపర్తి అన్నారు. ఈ సమావేశంలో అడకా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పోతురాజు సమతా పాల్గొన్నారు.

విభజన కంటే వైసీపీ పాలనలోనే ఎక్కువ నష్టపోయిన రాష్ట్రం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ



గుంటూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): 71 ఏళ్ల రాష్ట్ర చరిత్రలో జరిగిన అప్పు కంటే రెట్టింపు అప్పుతో జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఘోరంగా నష్టపరిచారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర విభజన కంటే గత ఐదేళ్ల వైసీపీ పాలనలోనే రాష్ట్రం ఎక్కువగా నష్టపోయిందని, జగన్ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో జరిగిన ఆర్థిక విధ్వంసంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్తుల్ని తాకట్టు పెట్టడం, స్థానిక సంస్థల నిధులు దారి మళ్లించడం, కార్పొరేషన్ల పేరుతో అప్పులు చేసి విచ్చలవిడిగా తన అనుయాయులకు దోచిపెట్టడమే లక్ష్యంగా పరిపాలన సాగించారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో తలసరి అప్పు రూ.1.44 లక్షలుగా ఉందని, వృద్ధిరేటు 13.2 శాతం నుంచి 9.5 శాతానికి పడిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దెయ్యాలు వేదాలు వల్లించినట్లు జగన్ వైఖరి

● టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మన్నవ వంశీకృష్ణ

గుంటూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర గల్లీలోని దెయ్యాల నాయకుడు జగన్మోహన్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి దేవుడిలాగా వేదాలు వల్లించినట్టుగా ఉందని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మన్నవ వంశీకృష్ణ అన్నారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేసేందుకు టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం టీఎన్ఎస్ఎఫ్ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వంశీకృష్ణ మాట్లాడుతూ అమరావతికి కేంద్ర బడ్జెట్లో 15 వేల కోట్ల రూపాయలు నిధులు విడుదల చేయడం, ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి తోడ్పాటునందించేందుకు కేంద్రం సుముకత తెలపడం హర్షనీయమన్నారు. అభివృద్ధిని చూస్తూ ఓర్చుకోలేక శవ రాజకీయాలు చేస్తున్న సైకో రెడ్డి వైఖరిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వినుకొండలో జరిగిన హత్యను రాజకీయ హత్యగా ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో తెలుగు విద్యార్థి నేతలు రాయపాటి అమృతరావు, కుంచకర్ల ధర్మతేజ, నక్క హేమంత్, దంతా ప్రశాంత్ గౌడ్, మహేంద్ర, సాయి ప్రతాప్, దీపు, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ స్కూటర్ తయారీదారు, డీలర్‌కు అరెస్టు వారెంట్ జారీ

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుడిని మోసగించడంతో పాటు వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఆదేశాలను ధిక్కరించి నందుకు ఎలక్ట్రిక్ స్కూటర్ తయారీదారు, డీలర్‌కు అరెస్టు వారెంట్ జారీ అయింది. హైదరాబాద్‌లోని పూరే ఎలక్ట్రిక్ స్కూటర్ తయారీదారునికి గుంటూరు అరండల్‌పేటలో డీలర్ ఉన్నారు. ఆయన వద్ద ఏటీ అగ్రహారం ఏడో లైనుకు చెందిన దుగ్గరాజు నాగేశ్వరరావు అనే వినియోగదారుడు 2021 డిసెంబరు 27వ తేదీన దాదాపుగా రూ.80 వేలు చెల్లించి బ్యాటరీతో నడిచే స్కూటర్‌ని కొనుగోలు చేశారు. బ్యాటరీపై 60 నెలల వారంటీ ఉండగా 11 నెలలకే సమస్య వచ్చింది. దాంతో వినియోగదారుడు డీలర్‌కు నివేదించగా పాత బ్యాటరీని అమర్చి పంపించారు. ఆ బ్యాటరీ కూడా రిపేర్‌కు రావడంతో మళ్లీ వినియోగదారుడు డీలర్ వద్దకు వెళితే ఈ దఫా తగిన స్పందన లేదు. డీలర్, తయారీదారుకు అనేక సార్లు ఫోన్లు చేసి పట్టించుకోకపోవడంతో బాధిత వినియోగదారుడు కమీషన్‌ని ఆశ్రయించారు. అయితే విచారణకు డీలర్, కంపెనీ యజమానులు సరిగా హాజరు కాలేదు. దాంతో ధిక్కరణ చర్యల కింద శుక్రవారం బెయిలబుల్ వారెంట్‌ని జారీ చేసింది.

రేపు స్టెమ్ స్కూల్‌లో జిల్లా స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు

గుంటూరు, జూలై 26 : గుంటూరు తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న గుంటూరు విద్యానగర్ ఒకటో లైనులో గల స్టెమ్ స్కూల్‌లో జిల్లా స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్-2024 పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియే షన్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బి.కాశీనాధరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ తైక్వాండోకు సంబంధించి స్పైరింగ్, పుంమ్సే పోటీలు సబ్ జూనియర్ (అండర్-11), క్యాడిట్ (12-14), జూనియర్ (15-17) విభాగాల్లోనూ, అదేవిధంగా వివిధ వెయిట్ కేటగిరిలలో బాల, బాలికలకు విడివిడిగా ఆయా పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో విజేతలైన వారు ఏపీ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 3, 4 తేదీల్లో అనంతపురం జిల్లాలో జరిగే పోటీలకు అర్హులన్నారు. వివరాలకు తనను 9502977441 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

పంచాయతీ కార్మికుల జీతాలను చెల్లించాలి

గుంటూరు(తూర్పు), జూలై 26 : పంచాయతీ కార్మికులకు సంవత్సరాలు తరబడి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, దీనిపై అధికారులకు పలుమార్లు వినతిపత్రం అందజేసినా పట్టించుకోవడం లేదని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా నాయకులు వై.నేతాజీ, డీవీ నరసింహారావు అన్నారు. పాతగుంటూరు సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. సమస్యల పరిష్కారానికి సెప్టెంబరు 10న జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ, చింతల శ్రీనివాసరావు, సీహెచ్ రాంబాబు, బి.సంధ్యారాణి పాల్గొన్నారు.

ఓయూ కళాశాలల్లో బీఈ/బీటెక్ లేటరల్ ఎంట్రీ

దిక్సూచి DIKSUCHI

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ)- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. యూనివర్సిటీ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజ్ సహా వర్సిటీ అనుబంధ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రతి కళాశాలలో స్పెషలైజేషన్‌కు 30 సీట్లు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఈ ప్రోగ్రామ్‌లకు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు ఉంటాయి. వారాంతాలు, సెలవు రోజుల్లో కూడా అందరి సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని క్లాసెస్ నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000. వర్సిటీ నిబంధనల మేరకు ఇతర ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.



అర్హత: ఏదేని గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. చేరదలచుకున్న ఇంజనీరింగ్ కాలేజీకి 100 కి.మీ.ల పరిధిలో ఉన్న కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు, ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలు/సంస్థల్లో పని చేస్తూ ఉండాలి. కనీసం ఏడాది అనుభవం తప్పనిసరి.

ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో స్పెషలైజేషన్‌కు సంబంధించి మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 36 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 15 శాతం మార్కులు రావాలి. పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 27
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** డిప్లొమా సర్టిఫికెట్-మార్కుల పత్రాలు, టీసీ, మైగ్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, పదోతరగతి సర్టిఫికెట్, ఆరోతరగతి నుంచి డిప్లొమా వరకు స్టడీ సర్టిఫికెట్లు, సర్వీస్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, జిరాక్స్ కాపీలు, రెండు ఫొటోలు.
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** ఆగస్టు 4
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 8
- **మొదటి ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 17
- **రెండో ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 24
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/7kP3x2Cలో చదవండి.

కోటక్ కన్య స్కాలర్‌షిప్

కోటక్ మహీంద్రా గ్రూప్ కంపెనీలు, కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'కోటక్ కన్య స్కాలర్‌షిప్ 2024-25' నోటిఫికేషన్ వెలువడింది. ప్రతిభావంతులైన బాలికలను ఉన్నత విద్యలో ప్రోత్సహిస్తూ వారికి ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కాలర్‌షిప్‌ను ఉద్దేశించారు. కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండో తరగతి పూర్తిచేసి గుర్తింపు పొందిన కాలేజీల్లో ఇంజనీరింగ్/మెడిసిన్/బీడీఎస్/ఫార్మసీ/ఆర్కిటెక్చర్/డిజైనింగ్ విభాగాల్లో డిగ్రీ ప్రవేశం పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ, బీఎస్సీ నర్సింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరినవారు; బెంగళూరు ఐఐఎస్సీ, ఐసర్ సంస్థల నుంచి ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్ అడ్మిషన్ పొందినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.6 లక్షలు మించకూడదు. ఎంపికైన బాలికలకు ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ఇంటర్నెట్, ల్యాప్‌టాప్, బుక్స్, స్టేషనరీ ఖర్చుల కింద ఏడాదికి రూ.లక్షన్నర ఇస్తారు. వార్షిక పరీక్షల్లో కనీసం 6 సీజీపీఏ సాధించేవారికి కోర్సు పూర్తయ్యేవరకూ స్కాలర్‌షిప్ కొనసాగిస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **వెబ్‌సైట్:** www.kotak.com, www.b4s.in/it/kkgs2

పోటీ నీకే - జయం నీదే

కొత్త పుస్తకం

పోటీ పరీక్షలు అంటే గ్రామీణ యువతలో విపరీతమైన క్రేజ్ ఉంటుంది. అయితే వీరిలో ఎక్కువ మంది గ్రూప్స్, టీచర్ వంటి ఉద్యోగాల పట్ల దృష్టిపెడతారు కానీ సివిల్స్ గురించి ఆలోచించరు. రాయాలని ఉన్నా అవి పెద్ద పెద్ద పట్టణాల్లో చదువుకున్నవారికి లేదా టాప్ ర్యాంకర్లకు ఉద్దేశించిన ఉద్యోగాలని భావిస్తుంటారు. అలాంటి వారికి మార్గనిర్దేశం చేసేందుకు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రావులపాటి సీతారామారావు 'పోటీ నీకే - జయం నీదే' పేరుతో పుస్తకం రాశారు.

ఏదో పనిమీద బయటకు వెళ్లినప్పుడు తనను కలిసిన విద్యార్థులు, ఉద్యోగార్థులు పలు సందేహాలు వెలిబుచ్చేవారు. తను వారికి ఇచ్చిన గైడెన్స్ అందరికీ చేరాలనే ఉద్దేశంతో రచయిత ఈ పుస్తకం రాశారు.


విజయం సాధించాలంటే పెద్ద బ్యాక్‌గ్రౌండ్ ఉండాల్సిన పనిలేదు. ఒక గమ్యాన్ని నిర్దేశించుకుని, దాని కోసం క్రమపద్ధతిలో కష్టపడాలని చెబుతారు. పోటీ పరీక్షల కోసం ప్లానింగ్ ఎలా చేసుకోవాలి? ఎన్ని గంటలు చదవాలి? పరీక్షల కోసం సిద్ధమయ్యే వారికి మెంటార్ అవసరమా? అని చెబుతూ తనతో సహా గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు సివిల్స్ వంటి పరీక్షల్లో ఎలా విజయం సాధించారో స్ఫూర్తి కలిగించేలా సవివరంగా చెప్పారు సీతారామారావు. పరీక్షలు రాసే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని అధిగమించిన తీరును పుస్తకంలో వివరించారు.

పరీక్షలకు సిద్ధంకావడానికి ముందే అకడమిక్ పరీక్షలకు, పోటీ పరీక్షలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంగా గ్రహించగలగాలి. చదువుకోవడానికి మూడ్ ఉండాలి, వారం-వర్జ్యం లాంటివి చూసుకోవాలనే మూఢనమ్మకాలు దరిచేరనీయ వద్దు. లక్ష్యం పెద్దగా నిర్ణయించుకున్నపుడు అందుకు అనుగుణంగానే ప్రిపేర్ కావాలి అని చెబుతారు. సెల్ఫ్ మోటివేషన్ పొందడానికి ఏమి చేయాలి? కొంత మంది సివిల్స్ అభ్యర్థులు ఎలా మోటివేట్ అయ్యారు అని వివరించారు. ఇవి సివిల్స్ అభ్యర్థులకు మాత్రమే కాకుండా అన్ని పరీక్షల విద్యార్థులకు ఉపయోగపడతాయి. ఈ పుస్తకాన్ని సాహితి ప్రచురణలు వారు ప్రింట్ చేశారు.

వెల: రూ.90/-

ప్రతులకు: సాహితి ప్రచురణలు 33-22-2, చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్.రోడ్, చుట్టుగుంట, విజయవాడ-520 002.

ఫోన్: 8121098500



నవ్య | చిత్రజ్యోతి

ఆ పాటలో కేసీఆర్‌ను తలుచుకున్నామంతే!



రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోని 'మార్ ముంతా ఛోడ్ చింతా' పాట వివాదంపై సంగీత దర్శకుడు మణిశర్మ స్పందించారు. ఆ పాటలో 'ఇప్పుడేం చేద్దాం' అంటూ కేసీఆర్ అన్న మాటను ఉపయోగించడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహించాయి. ఇటీవల ఇచ్చిన ఈ పాట గురించి ఇచ్చిన వీడియో ఇంటర్వ్యూలో మణిశర్మ వివరణ ఇస్తూ 'సోషల్ మీడియాలో వచ్చే మీమ్స్ ఆధారంగా ఆ పాట ఉంటుంది. కేసీఆర్ అంటే అందరికీ గౌరవం. ఆయన సరదాగా చెప్పిన ఓ పదాన్ని ఇందులో తీసుకున్నామంతే. ఎవరినీ నొప్పించడం మా ఉద్దేశం కాదు. నా 27 ఏళ్ల కెరీర్‌లో ఎవరినీ నొప్పించలేదు. ఆ పాటలో కేసీఆర్‌ను ఒకసారి తలచుకున్నాం. కేవలం అది వినోదం కోసమే. దయచేసి అందరూ అలాగే భావించండి' అన్నారు. 'డబుల్ ఇస్మార్ట్' లోని మూడో పాట 'క్యా లఫ్డా' ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన రామ్, హీరోయిన్ కావ్యా థాపర్ పోస్టర్ రొమాంటిక్‌గా ఉంది. ఆగస్టు 15న 'డబుల్ ఇస్మార్ట్' విడుదల కానుంది.

మనవడి స్కూలుకు రజనీ



పాఠశాలకు వెళ్ళేందుకు మారాం చేసిన తన మనవడిని తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ స్వయంగా స్కూల్‌కు తీసుకెళ్ళి వదిలిపెట్టారు. మనవడితో కారులో రజనీ స్కూల్‌కు వెళుతున్న ఫోటోను ఆయన చిన్న కుమార్తె సౌందర్య శుక్రవారం సామాజికా మాధ్యమాల్లో షేర్ చేస్తూ.. 'ఈ రోజు నా కుమారుడు స్కూల్‌కు వెళ్ళనని మొండికేయడంతో వాడి సూపర్ హీరో తాత (రజనీ) పాఠశాలకు స్వయంగా తీసుకెళ్లారు. వెండితెర అయినా, నిజజీవితంలో అయినా ఎలాంటి పాత్రనైనా నా తండ్రి అద్భుతంగా పూర్తి చేస్తారు' అని పేర్కొన్నారు. కాగా, సౌందర్య కుమారుడు వేద్‌ను పాఠశాల తరగతి గదిలోకి తీసుకెళ్ళిన రజనీకాంత్‌ను ఇతర పిల్లలు సంభ్రమాశ్చర్యాలతో చూశారు. వెండితెరవేల్పు రజనీ తమ కళ్లముందు ప్రత్యక్షమవ్వడంతో వారి ఆనందానికి హద్దే లేకుండాపోయింది. ఇదిలావుంటే, 'వేట్టయాన్' సినిమా పూర్తి చేసిన రజనీకాంత్ ఇపుడు లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌లో గ్యాప్ లభించడంతో ప్రస్తుతం ఆయన స్థానిక పోయెస్ గార్డెన్‌లో ఉన్న తన నివాసంలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి, (చెన్నై)

షారుక్ ఖాన్ రూ.40 కోట్లు.. అమితాబ్ రూ.30 కోట్లు...

అనంత్ అంబానీపై సినీ సెలెబ్రిటీల కానుకల వర్షం...



ఆభరణాల సెట్

అమితాబ్ బచ్చన్ దంపతులు, అభిషేక్, ఐశ్వర్య కలసి ఈ వధూవరులకి రూ.30 కోట్ల విలువైన ఆభరణాల సెట్‌ను (పచ్చల హారాన్ని) బహుమతిగా ఇచ్చారు.



ఇటీవలే అంగరంగ వైభవంగా జరిగిన అనంత్ అంబానీ, రాధిక మర్చంట్‌ల వివాహం.. ప్రపంచవ్యాప్తంగా జరిగిన అత్యంత ఖరీదైన పెళ్లిల్లో ఒకటిగా నిలిచిపోయింది. ఈ చిరకాల వేడుకకు అంబానీ కుటుంబం చేసిన హంగామాని ప్రజలు కలకాలం గుర్తుంచుకుంటారు. ఆకాశంలో చంద్రుడు చుట్టూ ఉన్న అసంఖ్యాక తారల్లా.. అంబానీ పెళ్లిలో అనేక రంగాల్లోని అగ్ర తారలందరూ సందడి చేసి దేదీప్యమానంగా వెలుగులు విరబూశారు. ఈ విలాసవంతమైన పెళ్లికి అదిరిపోయే రేంజ్‌లో అత్యున్నతమైన ఏర్పాట్లకు తోడు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ తారలు హాజరవడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకకు వచ్చిన కొందరికి అంబానీ కుటుంబం అతిథి మర్యాదలతో దాదాపు రూ.రెండు కోట్ల విలువ చేసే వాచీలను గిఫ్ట్‌గా ఇచ్చారు. అలాగే సినీ సెలబ్రిటీలు కూడా ఈ కొత్త జంటకు కానుకలు అందించడానికి క్యూ కట్టడం విశేషం. మిగతా పరిశ్రమల నటీనటులు ఏయే బహుమతులు ఇచ్చారో తెలియదు కానీ.. బాలీవుడ్ తారలు ఇచ్చిన బహుమతుల వివరాలు ఒక్కొక్కటే బయటకు వస్తున్నాయి. ఎవరు ఏమేమిచ్చారో ఇప్పుడు తెలుసుకుందాం.



రూ.40 కోట్ల విల్లా

బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ ఈ నూతన జంటకు ఫ్రాన్స్‌లో రూ.40 కోట్లు ఖరీదు చేసే ఓ విలాసవంతమైన భవంతిని కానుకగా ఇచ్చారు.



రూ.20 కోట్ల రోల్స్ రాయిస్

'కల్కి 2898 ఏ.డీ'తో తెలుగువారికి చేరువైన దీపికా పదుకొనే, తన భర్త రణ్‌వీర్ రూ.20 కోట్లు పెట్టి ఓ రోల్స్ రాయిస్ కారును వెడ్డింగ్ ప్రజంటేషన్‌గా ఇచ్చారు.



రూ.15 కోట్ల బైక్

సల్మాన్ ఖాన్ రూ.15 కోట్ల విలువైన స్పోర్ట్స్ బైక్‌ను కానుకగా ఇచ్చారు.

రూ.తొమ్మిది కోట్ల మెర్సిడెస్

రణ్‌బీర్ కపూర్, అలియా భట్ జంట ఈ కపుల్‌కు రూ.తొమ్మిది కోట్ల విలువైన మెర్సిడెస్ కారును గిఫ్ట్‌గా ఇచ్చారు.









వీరితో పాటు, అక్షయ్ కుమార్ రూ.60 లక్షలు విలువ చేసే బంగారపు పెన్నును.. సిద్ధార్థ్ మల్హోత్రా, కియారా అద్వానీ దంపతులు రూ.25 లక్షలు విలువ చేసే హ్యాండ్ మేడ్ శాలువాను.. విక్కీకౌశల్, కత్రినా కైఫ్ దంపతులు రూ.19 లక్షల బంగారు గొలుసును బహూకరించారు.

మూడేళ్ల కష్టం.. కమిటీ కుర్రోళ్లు



అంతా కొత్తవారితో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ట్రైలర్‌ను శుక్రవారం హీరో సిద్ధు జొన్నలగడ్డ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చిన్న సినిమా, పెద్ద సినిమా అని ఉండదు. ఓ సినిమాకు ఎక్కువ ఖర్చు పెడతాం, మరో చిత్రానికి తక్కువ ఖర్చు పెడతాం.. తేడా అంతే. ఈ సినిమాలో విజువల్స్ బాగున్నాయి. కొత్తవారితో ఇంత మంచి చిత్రం తీయడం మాములు విషయం కాదు. దర్శకుడు యదు వంశీకి ఇదే మొదటి సినిమా అంటే నమ్మబుద్ధి కావడం లేదు. ఈ సినిమా హిట్ అయి అందరికీ లాభాలు తేవాలి' అని కోరారు. చిత్ర సమర్పకురాలు నిహారిక మాట్లాడుతూ 'మూడేళ్ల కష్టం ఈ సినిమా. వీరంతా మూడేళ్లుగా పని చేస్తునే ఉన్నారు. అంతా కష్టపడి మంచి సినిమా చేశాం. ఆగస్టు 9న సినిమాను విడుదల చేస్తున్నాం' అని చెప్పారు. 'మా సినిమాలో నటించిన 11 మంది సిద్ధులాగా ఎంతో కష్టపడుతుంటారు. మా టెక్నికల్ టీమ్ సపోర్ట్‌తో సినిమాను బాగా తీయగలిగాను. నిహారిక, ఫణి లేకపోతే చిత్రం ఇలా వచ్చేదే కాదు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేశ్ సహకారం మరువలేనిది' అని చెప్పారు దర్శకుడు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తీసిన యూత్‌ఫుల్ మూవీ ఇదని నిర్మాత ఫణి అడపాక, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేశ్ చెప్పారు.

'పావలా' శ్యామలకు సాయి దుర్గతేజ్ ఆర్థిక సాయం



ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న సీనియర్ నటి 'పావలా' శ్యామలకు హీరో సాయి దుర్గతేజ్ ఆర్థిక సాయం చేశారు.. తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యుల ద్వారా శ్యామలకు లక్ష రూపాయలు పంపించారు. శ్యామల ఎమోషనల్ అయి 'మా అమ్మాయికి ఆపరేషన్ అయినప్పుడు సాయి దుర్గతేజ్ ఫోన్ చేసి, ధైర్యం చెప్పారు. వచ్చి కలుస్తానన్నారు. చాలా రోజులైంది. మరిచిపోయారేమో అనుకున్నా. గుర్తు పెట్టుకుని సాయం చేసినందుకు ధన్యవాదాలు' అన్నారు.

సస్పెన్స్ థ్రిల్లర్



కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా నటించిన చిత్రం 'జ్యువెల్ థీఫ్' సీనియర్ నటి ప్రేమ కీలక పాత్ర పోషించారు. పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మించారు. ఇటీవలే సినిమా టీజర్‌ని, ఆడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'నేను సూపర్‌స్టార్ కృష్ణగారి అభిమానిని. ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. ఈ తరం ప్రేక్షకులకు నచ్చే సస్పెన్స్ థ్రిల్లర్. త్వరలోనే విడుదల చేస్తాం' అని చెప్పారు.

వాణిజ్య హంగులతో విరాజి



వరుణ్ సందేశ్ కథానాయకుడిగా ఆద్యంత్ హర్ష తెరకెక్కించిన చిత్రం 'విరాజి'. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మీడియాతో ముచ్చటించారు. 'గతంలో మా సంస్థలో వరలక్ష్మి శరత్‌కుమార్‌తో 'శబరి' చిత్రాన్ని నిర్మించాం. మేం నిర్మించిన రెండో చిత్రం 'విరాజి'. వరుణ్ సందేశ్ కొత్తలుక్‌లో కనిపిస్తారు. ఆయన గెటప్‌కు కథలో ప్రాధాన్యం ఉంది. మన సమాజంలోని ఒక అంశాన్ని తీసుకొని కమర్షియల్ కోణంలో సినిమాను తెరకెక్కించాం' అని మహేంద్రనాథ్ చెప్పారు.



ట్రైనీ కలెక్టర్లతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది

యూపీహెచ్‌సీని సందర్శించిన ట్రైనీ కలెక్టర్లు

తాడేపల్లి టౌన్, జులై 26: డ్రైవర్స్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)ను ఆరుగురు ట్రైనీ కలెక్టర్లు శుక్రవారం సందర్శించారు. ఆరోగ్యకేంద్రం ద్వారా ప్రజలకు అందుతున్న వైద్యసేవలు లేబొరేటరీ, అందుబాటులోవున్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏఎన్ఎంలు, ఆశాలు వారి జాబ్ చార్ట్ ప్రజాక్షేత్రంలో లబ్ధిదారులకు ఏ విధంగా సేవలు అందిస్తున్నారు, అన్ని రకాల జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాల గురించి వైద్యాధికారిణి డాక్టర్ మానస వివరించారు. కార్యక్రమంలో ఏపి ఆరోగ్యశ్రీ సీఈవో డాక్టర్ జీ. లక్ష్మయ్య స్టేట్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ రమాదేవి మలేరియా ఏరియా అధికారి శ్రీమన్నారాయణ, సీహెచ్‌వో గురుకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మంగళగిరి సిటీ, జూలై 26: విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళగిరి పట్టణంలోని తెనాలి ఫ్లై ఓవర్, రత్నాలచెరువు, కొండపనేని టౌన్‌షిప్, సుందరయ్య నగర్, ఆత్మకూరు గ్రామంలోని శ్రీశైల నగర్, అక్షయపాత్ర, అభినందన ప్లాట్స్, కోకాకోలా ఏరియా, చినకాకాని గ్రామం, రాజీకమల్ రోడ్డు, హాయ్‌లాండ్ రోడ్డు, చినవడ్లపూడి, పెదవడ్లపూడి గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, నవులూరు ఈఎస్ఆర్ గార్డెన్స్, గోలివారి తోట, మక్కెవారి పేట, బాపనయ్య నగర్, ఉడా కాలనీ, శిబిరం, బాపూజీ నగర్, టిడ్కో ఏరియాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తాడేపల్లి పట్టణంలోని ఉండవల్లి, సీతానగరం, పోలకంపాడు, నులకపేట, ప్రకాష్‌నగర్, డోలాస్ నగర్ ఏరియాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కుంచనపల్లి గ్రామంలో ఉదయం 9 నుంచి 10.30 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

డీజిల్ చోరీ నిందితులకు రిమాండ్

మేడికొండూరు, జూలై 26: డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను మేడికొండూరు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు. మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పేరేచర్ల గ్రామానికి చెందిన ఓర్సు వెంకట పవన్ కళ్యాణ్, ,చింతపల్లి శ్రీను, దాసరి రోనాల్డ్ రాజు అనే ముగ్గురు చెడు వ్యసనాలకు బానిసలై మండల పరిధిలోని పలు గ్రామాలలో ఆగి ఉన్న వాహనాలు లక్ష్యంగా చేసుకొని డీజిల్, పెట్రోలను చోరీలకు పాల్పడుతున్నారు. ప్రత్యేక పరికరాలతో వాహనాల ట్యాంకుల్లోని ఆయిల్‌ను పైపుల ద్వారా తీసి గ్రామాల్లో లీటరు రూ.70 చొప్పున అమ్ముతుంటారు. ఈనెల 18న పేరేచర్లలోని వీవీసీ స్టోన్ క్రషర్ జేసీబీ ట్యాంకులోని 150 లీటర్ల డీజిల్‌ను దొంగతనం చేశారు. ఈ ఘటనపై స్టోన్ క్రషర్ యజమాని మేడికొండూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా ఓర్సు వెంకట పవన్ కళ్యాణ్, చింతపల్లి శ్రీను, దాసరి రోనాల్డ్ రాజులు ఆయిల్ చోరీకి పాల్పడినట్లు రికార్డు అయింది. వీరిని శుక్రవారం ఉదయం పేరేచర్ల గ్రామంలో అదుపులోకి విచారించగా నేరం అంగీకరించారు. నిందితులపై కేసు నమోదుచేసి గుంటూరు కోర్టులో హాజరు పరచగా, కోర్టు వారికి 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. నిందితులను నేర్పుతో పట్టుకున్న ఎస్ఐ వాసు, కానిస్టేబుల్ రామారావు, సిద్దు, కోటేశ్వరరావులను ఉన్నతాధికారులు ప్రశంసించారు.

కేఎల్‌యూను సందర్శించిన ఆస్ట్రేలియా వర్సిటీ బృందం



న్యూ కాజిల్ యూనివర్సిటి ఆచార్యులను సత్కరిస్తున్న కేఎల్‌యూ డీన్ డాక్టర్ కిషోర్ బాబు

తాడేపల్లి, జులై 26: ఆస్ట్రేలియాలోని సిడ్నీలోని న్యూ కాజిల్ యూనివర్సిటి ప్రతినిధుల బృందం శుక్రవారం కేఎల్ యూనివర్సిటీని సందర్శించింది. డాక్టర్ ఫ్రాన్సెస్కోపోలోచి ఆధ్వర్యంలో పర్యటించిన ఈ బృందం ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యనభ్యసించాలనుకునే విద్యార్థులకు గల అపార అవకాశాల గురించి అవగాహన కల్పించారు. ఆస్ట్రేలియాలో పరిశోధనలు చేయాలనుకునే విద్యార్థులకు ఉన్న వసతులను వివరించారు. ఈ సందర్భంగా కేఎల్‌యూ విదేశీ సంబంధాల డీన్ డాక్టర్ ఎన్. కిషోర్‌బాబు మాట్లాడుతూ కేఎల్‌యూ పరిశోధనల కోసం విద్యార్థుల రాకపోకల ద్వారా వారి విజ్ఞానపరమైన ఆలోచనలను విస్తృత పరిచేందుకు గాను ప్రపంచంలోని నలుమూలలా ఉన్న విశ్వవిద్యాలయాలతో ఒప్పందాన్ని కలిగి వుందని, ఒక సెమిష్టర్ లేదా ఒక సంవత్సరం కానీ రెండు సంవత్సరాల పాటు వేరే దేశాలలో చదువుకునే ఏర్పాట్లు ఈ ఒప్పందాల్లో భాగమని తెలియజేశారు. అనంతరం అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే. సుబ్బారావు, వీసీ సారధివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ప్రసాద్, వెంకట్రామ్, రాజశేఖర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పొలాలు, కాల్వలు పరిశీలించిన టీడీపీ నేతలు

తాడేపల్లి, జులై 26: తాడేపల్లి ముగ్గురోడ్డు ప్రాంతంలో పంట పొలాలను కుంచనపల్లి ఆంధ్రరత్న పంపింగ్‌స్కీమ్ వద్దనున్న పంట కాలువను శుక్రవారం తాడేపల్లి పట్టణ టిడిపి అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, టీడీపీ నేతలు రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తాము పంటలు వేసుకోవడానికి ఇబ్బంది కరంగా ఉందని పంట పొలాల్లో నీరు నిలిచి పోవడంతో పంటలు వేసుకోలేకపోతున్నామని వెంకట్రావు దృష్టికి తీసుకు వచ్చారు. వెంటనే స్పందించిన వెంకటరావు డీఈతో మాట్లాడి పంట పొలాల్లో ఉన్న నీటి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే డీఈ స్పందించి పంట పొలాల్లో నీటిని తొలగిస్తామన్నారు. అనంతరం ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ పంటకాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా పంట కాలువలో పేరుకుపోయిన చెత్త చెదారాలను వ్యర్థాలను వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న సోషల్‌వెల్ఫేర్ డీడీ మధుసూధనరావు

బాలికల వసతిగృహాన్ని సందర్శించిన డీడీ

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

● వసతిగృహ గదులు, మరుగుదొడ్ల మరమ్మతులకు ఆదేశం

దుగ్గిరాల, జూలై 26: స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహాన్ని శుక్రవారం సాంఘిక సంక్షేమ శాఖ డీడీ డీ.మధు సూధనరావు సందర్శించారు. తలుపులు లేని గదులకు మరుగుదొడ్లకు తక్షణమే కొత్త తలుపులు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. బాలికల వసతి గృహంలో వసతుల కరవు పేరిట ఆంధ్రజ్యోతిలో శుక్రవారం కథనం ప్రచురితమైన విషయం విదితమే. బాలికలు రాత్రులు నిద్రించే గదులతో పాటు, మరుగుదొడ్లకు తలుపులు లేవని, ప్రహరీ లేదని, ప్రాంగణంలోకి మందలుగా వస్తున్న కోతులతో ఇబ్బందులు పడుతున్నామని, తాగునీటి ఒకే ఒక్కట్యాంక్ ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని డీడీకి విద్యార్థినులు తెలియజేశారు. చిన్నవిషయాలను కూడా అధికారులకు తీసుకురాక పోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలున్నా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. సమస్యలపై తాత్సారం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. తక్షణమే తలుపులు ఏర్పాటు చేయాలని, భవిష్యత్‌లో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కనీస వసతులపై దృష్టి పెట్టాలని వార్డెన్ నిర్మలను ఆదేశించారు. ఎంపీడీవో భార్గవి, సూపరింటెండెంట్ డీ. వీరయ్య, ఎంఈవో కే. శ్రీనివాసరావు తదిరులు పాల్గొన్నారు.

చదువుల తల్లికి చేయూత

● సొంత నిధులతో ట్యూషన్ ఫీజు అందజేసిన మంత్రి లోకేశ్



గండికోట కార్తీకకు చెక్కును అందజేస్తున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి, జూలై 26: విదేశాల్లో చదువుతున్న ఓ వైద్య విద్యార్థినికి తన సొంత నిధుల నుంచి ట్యూషన్ ఫీజు అందజేసి మంత్రి నారా లోకేశ్ తన గొప్ప మనస్సును చాటుకున్నారు. మంగళగిరి మండలం చినకాకాని గ్రామానికి చెందిన గండికోట కార్తీక ఉజ్బెకిస్థాన్‌లోని తాష్కెంట్ మెడికల్ అకాడమీలో మెడిసిన్ జనరల్ ప్రాక్టీషనర్ (ఫిజీషియన్) 4వ సంవత్సరం చదువుతోంది. గత ప్రభుత్వం విధించిన అడ్డగోలు నిబంధనల కారణంగా కార్తీకకు విదేశీ విద్య ద్వారా ఎలాంటి సాయం అందలేదు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన తమ బిడ్డ చదువుకు సాయం అందించాలని కార్తీక తండ్రి శ్రీనివాసరావు ఇటీవల ప్రజా దర్బార్‌లో లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన మంత్రి లోకేశ్ పూర్తి వివరాలు తెలుసుకోవాలని వ్యక్తిగత సిబ్బందిని ఆదేశించారు. ఈఏడాది ఆగస్టు 14వ తేదీ నాటికి కార్తీక 4వ సంవత్సరం ఫీజు చెల్లించి కళాశాలకు వెళ్లవలసి వుంది. విదేశీ విద్య పథకానికి కొత్త గైడ్‌లైన్స్ ఇంకా తయారుకాకపోవడంతో ప్రభుత్వం ద్వారా ఆ విద్యార్థినికి సాయం అందించే అవకాశం లేదు. దీంతో మంత్రి లోకేశ్ స్పందిస్తూ కార్తీక ట్యూషన్ ఫీజుకు అవసరమైన రూ.1.43 లక్షలను తన సొంత నిధుల నుంచి సమకూర్చాల్సిందిగా వ్యక్తిగత సిబ్బందికి సూచించారు. దీనికి సంబంధించిన చెక్కును ఉండవల్లిలోని నివాసంలో శుక్రవారం ఆయనే స్వయంగా కార్తీకకు అందజేశారు. తొలుత ట్యూషన్ ఫీజు చెల్లించి కళాశాలకు వెళ్లాలని, విదేశీ విద్య పథకానికి నూతన గైడ్‌లైన్స్ రూపొందించాక ప్రభుత్వం ద్వారా సాయం అందించే అంశాన్ని పరిశీలిస్తానని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థిని కార్తీకతోపాటు ఆమె కుటుంబ సభ్యుల సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి.

మాజీ సీఎం నివాసం వద్ద ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు



తాడేపల్లిలో మాజీ సీఎం జగన్ నివాసం ఎదురు రోడ్లపై కార్ల పార్కింగ్

● రహదారిపైనే అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

● ఆ వైపు వెళ్లేవారికి తరచూ ట్రాఫిక్ సమస్యలు

తాడేపల్లిటౌన్, జులై 26: తాడేపల్లిలో వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్ నివాసం వద్ద నిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పార్టీ నాయకులు ఆయన నివాసం ఎదురుగా రోడ్డుపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపివేసి వెళ్లిపోతున్నారు. ఇతర వాహనాలు తిరిగేందుకు వీలు లేకుండా రోడ్డు మధ్యలో పార్కింగ్ చేయడంతో స్కూలు, కాలేజి బస్సులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు రోడ్డుపై నిలపవద్దని పలుమార్లు వాహనదారులు, ప్రయాణికులు వారించినా వైసీపీ నేతలు, కార్యకర్తలు పట్టించుకోవడం లేదని ఆమార్గంలో ప్రయాణించేవారు వాపోతున్నారు. చాలా కాలం తర్వాత మంత్రి నారా లోకేశ్ చొరవతో ఈ మార్గంలో ప్రయాణించే అవకాశం వచ్చినా అడ్డంకులు తప్పడంలేదని పెదవి విరుస్తున్నారు. సీఎం చంద్రబాబు సైతం ప్రజలకు తను వెళ్లేమార్గంలో ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశిస్తే మాజీ సీఎం జగన్ చర్యలు మాత్రం ప్రజలకు విరుద్ధంగా ఉన్నాయని ఆరోపిస్తున్నారు. తమ సమస్యలు అర్థంచేసుకుని ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్యలు కలుగకుండా చూడాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

నిబంధనల ప్రకారం ఇసుక సరఫరా..

తాడేపల్లి, జులై 26: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని రూపొందించినందున నిబంధనల ప్రకారం ఉచిత ఇసుక సరఫరాపై తగు చర్యలు తీసుకోవాలని జేసీ ఏ.భార్గవతేజ అధికారులకు సూచించారు. శుక్రవారం తాడేపల్లి మండలం గుండిమెడ ఇసుక రీచ్‌ను ఆయన సందర్శించారు. ఇసుకను వినియోగదారులకు సరఫరా చేస్తున్న తీరును పరిశీలించారు. ఇసుక కొరకు ఇబ్బందులు పడకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం విధివిధానాలు రూపొందించిందని, ఆమేరకు సజావుగా ప్రజలకు అవసరమైన ఇసుక ను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశాలిచ్చారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

తాడికొండ, జూలై26: ప్రజలందరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తాడికొండ సర్పంచ్ తోకల సరోజిని కోరారు. శుక్రవారం గ్రామంలోని రావిచెట్టు సెంటర్‌లోని నార్త్ స్కూల్లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని హెల్త్, పంచాయతీ, అంగన్‌వాడీ వర్కర్లు నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థుతో హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు చేతులను సబ్బుతో శుభ్రపరుచుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీళ్లను తాగాలన్నారు. వేడి వేడి ఆహార పదార్థాలను భుజించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. చెత్తను కాల్వల్లో వేయకుండా చెత్త కుండీల్లో వేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పీ.శ్రీనివాసులరెడ్డి, హెల్త్ డిపార్ట్‌మెంట్, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు ప్రజలు సహకరించాలి

తాడికొండ, జూలై 26: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని, దానిలో ప్రజలు భాగస్వాములు కావాలని కంతేరు పంచాయతీ కార్యదర్శి నాదెండ్ల రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం గ్రామంలోని చెరువులో గంబూజియా చేప పిల్లలను విడిచి పెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల్లోని దోమల లార్వాలను చేపలు తినటం వలన దోమలు వృద్ధిని నియంత్రించ వచ్చని తెలిపారు. కాల్వల్లో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్, ఫాగింగ్ చేస్తామని తెలిపారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఉండాలన్నారు. ప్రజల సహకారంతోనే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 916 క్యూసెక్కులు

దుగ్గిరాల, జూలై 26: కృష్ణాపశ్చిమడెల్టాకు ప్రకాశం బ్యారేజి నుంచి 916 క్యూసెక్కుల నీటిని శుక్రవారం విడుదల చేశారు. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 210 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 322 క్యూసెక్కులు, పశ్చికాల్వకు 85క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 238 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 200క్యూసెక్కులు విడుదల చేశారు.



ఫిరంగిపురంలో ఫార్మసీ కళాశాలలో మాట్లాడుతున్న లీగల్ అడ్వయిజర్ విజయలక్ష్మి

'మిషన్ శక్తి'పై మహిళలకు అవగాహన

ఫిరంగిపురం, జూలై 26 : 'మిషన్ శక్తి' వంద రోజుల ప్రత్యేక కార్యక్రమంలపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జేవీఆర్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన ఈ సదస్సులో జిల్లా సఖి వన్ స్టాప్ సెంటర్ లీగల్ అడ్వయిజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళా చట్టాలు, మహిళ సంరక్షణకు సంబంధించిన టోల్ ఫ్రీ నెంబరు గురించి వివరించారు. అలాగే సైబర్ క్రైం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఉమాదేవి, ఎంపీడీవో విమాదేవి, ఐఈడీఎస్ ప్రాజెక్టు అధికారి ప్రసూన, ప్రిన్సిపాల్ జీవన్ అధ్యాపకులుపాల్గొన్నారు.

అమ్మవారికి ఆషాడ పట్టీ సమర్పణ ఉత్సవం

దుగ్గిరాల, జూలై 26: మండలకేంద్రం దుగ్గిరాలలో గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి ఆలయంలో అమ్మవారికి ఆషాఢ సారె పట్టీ సమర్పణ కార్యక్రమాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పసుపు, కుంకుమలు, పూలు, గాజులు, చీరెసారెలతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఆషాఢమాసం పౌర్ణమి అనంతరం వచ్చే శుక్రవారం సందర్భంగా గ్రామంలోని మహిళా భక్తులు చీర, గాజులు, పసుపు కుంకుమల సారెను తీసుకుని ఊరేగింపుగా చేరుకున్నారు. భక్తిశ్రద్ధలతో సామూహికంగా తమ వెంటతెచ్చిన సారెను సమర్పించి పూజాకార్యక్రమంలో పాల్గొన్నారు. అర్చకుడు యుగంధర్ శర్మ అమ్మవారిని గాజులతో అలంకరించి, ప్రత్యేక పూజాకార్యక్రమాల అనంతరం సారె తెచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

మాజీ అడిషనల్ పీపీ కిషోర్ మృతి

మంగళగిరి, జూలై 26: మంగళగిరి బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేటూరి కిషోర్ (56) శుక్రవారం మృతి చెందారు. రెండు రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికాగా మంగళగిరి ఎన్నారై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఆయన మృతిచెందారు. 1994లో న్యాయవాదిగా తన వృత్తిని చేపట్టిన కిషోర్, క్రిమినల్ లాయర్‌గా పేరు ప్రఖ్యాతులు సాధించారు. గతంలో మంగళగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేశారు. కిషోర్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు మంగళగిరి మండలం చినకాకానిలోని కిషోర్ నివాసం నుంచి అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రత్యేక హోదాతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

మంగళగిరి, జూలై 26: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక హోదా కావాలని, అందుకోసం సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ కోరారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎన్డీఏలో ఈలకంగా వున్న బీహార్, ఏపీలకు నిధులు అధికంగా కేటాయించామని చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించినట్లు నమ్మించి ఆ అప్పును 25 సంవత్సరాలపాటు తీర్చాలని దగా చేశారని విమర్శించారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ రైల్వేజోన్, కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని, విభజన హామీలను అమలు జరపాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు. ఈ ఏడాది డిసెంబరు ఈ సమావేశంలో సీపీఐ ఏరియా కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నేతలు అన్నవరపు ప్రభాకర్, మేడా హనుమంతరావు, జాలాది జాన్‌బాబు, నందం బ్రహ్మేశ్వరరావు, చిన్ని సత్యనారాయణ, బత్తూరి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్న దోస్త్ సభ్యులు

దుగ్గిరాల, జూలై 26: పదోతరగతి పరీక్షల్లో ఉత్తఫలితాలు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు ఉపకారవేతనాలను అందించారు. శుక్రవారం దుగ్గిరాల ఒన్‌సేవా ట్రస్ట్(దోస్త్) ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్స్ విద్యార్థులతోపాటు, స్థానిక డాక్టర్ కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీకళాశాల, కంభంపాటి నారాయణ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించారు. ముఖ్య అతిథులుగా హాజరైన దోస్త్ ప్రధాన కార్యదర్శి చాగర్లమూడి శ్రీనివాస్, గౌరవా ధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావులు మాట్లాడుతూ, విద్య, వైద్యం క్రీడలు, సాంప్రదాయ, సాంస్కృతిక రంగాల్లో రాణిస్తున్న వారిని పోత్సహిస్తూ గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నా మన్నారు. విద్యార్థులు సామాజిక దృక్పథంతో జీవితంలో తాము ఎదుగుతూనే సమాజాభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. గూడూరు వెంకట్రావు, కొంగర జోగేంద్రప్రసాద్, కొండపనేని రవీంద్ర, గద్దె రవీంద్ర, జంపాల నరేంద్ర, వై. ముత్యం, ప్రిన్సిపాల్స్ కొత్త గిరిధరరావు, కే. సరళాదేవి, హెచ్ఎంలు శోభాదేవి, హేమలత, హైమావతి, వీవీ సతీష్, విజలక్ష్మి, విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

21 మంది తహసీల్దార్లు వెనక్కు

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణ కోసం ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి గుంటూరుకు వచ్చిన 21 మంది తహసీల్దార్లను కలెక్టర్ నాగలక్ష్మి వారి సొంత జిల్లాలకు వెనక్కు పంపించారు. సీసీఎల్‌ఏ జయలక్ష్మి ఆదేశాల మేరకు శుక్రవారం వారిని రిలీవింగ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తాడికొండ తహసీల్దార్ పీ మధుసూదనరావు, కే వెంకటేశ్వరరావు(మంగళగిరి), కే రవిబాబు(దుగ్గిరాల), పీ పార్వతి(కాకుమాను), టీ శ్రీనివాసులు (వట్టిచెరుకూరు), కే రవీంద్రరెడ్డి(గుంటూరు పశ్చిమ)లను పూర్వపు ప్రకాశంజిల్లాకు పంపించారు. అలానే వీ సుధీర్(తుళ్లూరు), జీ రాఘవేంద్రరావు(ఫిరంగిపురం), కే రాజ్యలక్ష్మి(మేడికొండూరు), టీ విజయకుమార్(తాడేపల్లి), ఆర్ సూర్యనారాయణ సింగ్(పొన్నూరు), ఈ రమాదేవి(చేబ్రోలు), ఎస్ శ్రీనివాసులురెడ్డి (తెనాలి), ఎస్ శ్రీనివాసులు(కొల్లిపర), ఎం పద్మజ(ప్రత్తిపాడు), డీ లాజరస్ (పెదనందిపాడు), టీ విజయకుమార్(ఏవో), పీ శాంతకుమారి(మేజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్), ఎం నిరంజన్(డీఏవో, గుంటూరు ఆర్‌డీవో), కే జయజయరావు(డీఏవో, తెనాలి సబ్ కలెక్టర్ ఆఫీసు)లను పూర్వ నెల్లూరు జిల్లాకు పంపించారు. ఎన్నికల విధుల కోసం ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు అక్కడ రిలీవింగ్ అయి శని/సోమవారాల్లో కలెక్టరేట్‌కు వచ్చి రిపోర్టు చేయనున్నారు. వారికి కలెక్టర్ పోస్టింగ్‌లు కల్పిస్తారు. అప్పటి వరకు డిప్యూటీ తహసీల్దార్లకు ఇన్‌చార్జి తహసీల్దార్ బాధ్యతలు కల్పించారు.



మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న జానకీదేవి, జయసత్య, భూలక్ష్మీ

మహిళల ఆర్థిక అభ్యున్నతికి స్త్రీ శక్తి దోహదం

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి

● స్త్రీ శక్తి 60వ బ్యాచ్‌లో 80 మంది మహిళలకు శిక్షణ

● మంత్రి నారా లోకేశ్ సహకారంతో కుట్టుమిషన్లు పంపిణీ

మంగళగిరి సిటీ, జూలై 26: రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీ శక్తి కార్యక్రమం మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి అన్నారు. స్త్రీ శక్తి 60వ బ్యాచ్‌లో మంగళగిరి పట్టణం, మండలానికి చెందిన 80 మంది మహిళలు రెండు నెలలపాటు కుట్టు శిక్షణ పూర్తిచేసుకున్నారు. వీరికి మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో శుక్రవారం మంత్రి లోకేశ్ సహకారంతో ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కుట్టు మిషన్లు అందుకున్న మహిళలు మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, కార్యదర్శి వింజమూరి ఆషాబాల, నియోజకవర్గ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మీ, పట్టణ అధ్యక్షురాలు ఊట్ల దుర్గామల్లేశ్వరీ, మండల అధ్యక్షురాలు గడ్డిపాటి అపర్ణ, తెలుగు మహిళలు దామర్ల పద్మజ, యర్రంశెట్టి సునీత, అప్పల శాంతి, ఉడతా లావణ్య, కోటేశ్వరమ్మ, దివి లక్ష్మీ, అంచే విజయలక్ష్మీ పాల్గొన్నారు.

ప్రగడ కోటయ్య ఆశయ సాధనకు కృషి

● టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు

మంగళగిరి సిటీ, జూలై 26: ప్రగడ కోటయ్య ఆశయ సాధనే లక్ష్యంగా తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు అన్నారు. చేనేత పితామహుడు, ప్రజాబంధు స్వర్గీయ ప్రగడ కోటయ్య 109వ జయంతిని పురస్కరించుకుని వీవర్సు కాలనీ మునిసిపల్ హైస్కూల్లో ఆయన విగ్రహానికి తెలుగునాడు చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. నేతలు మాట్లాడుతూ చేనేతపై కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీ నుంచి విముక్తి కలిగిస్తామని మంత్రి నారా లోకేశ్ గతంలోనే హామీ ఇచ్చారని, ఆ హామీని ప్రభుత్వం తప్పకుండా నెరవేరుస్తుందని చెప్పారు. చేనేత వర్గాల ఉన్నతి కోసం, వృత్తి పరిరక్షణ కోసం ప్రగడ కోటయ్య జీవితకాలం పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, నేతలు జంజనం వెంకట సుబ్బారావు, కారంపూడి అంకమ్మరావు, వంగర లక్ష్మయ్య, రాజశేఖర్, నాగమల్లేశ్వరరావు, లక్ష్మీపెరుమాళ్లు, నందం బాబూరావు, విఠల్‌రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేసిన ప్రగడ కోటయ్య చేనేతల ఆత్మబంధువుగా కీర్తి గడించారని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం కార్యాలయంలో శుక్రవారం కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పద్మశాలీయ బహూత్తమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ప్రగడ కోటయ్య చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ చేనేత వర్గాల అభ్యున్నతి కోసం అవిశ్రాంత పోరాటం చేసిన కోటయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, కుమ్మర క్రాంతికుమార్, నేతలు తదితరులు పాల్గొన్నారు.



ప్రగడ కోటయ్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



రవితేజ మృతదేహాన్ని ఊరేగింపుగా స్వగృహానికి తీసుకువస్తున్న స్నేహితులు, బంధువులు, కుటుంబసభ్యులు, ఇన్‌సెట్‌లో మృతుడు రవితేజ ఫైల్‌ఫొటో

తెనాలి చేరుకున్న రవితేజ మృతదేహం

● ఉన్నత చదువులకు అమెరికా వెళ్లి మృతి

తెనాలి రూరల్, జూలై 26: గత సంవత్సరం ఎంఎస్ చదివేందుకు అమెరికా వెళ్లిన తెనాలికి చెందిన తాడిబోయిన రవితేజ (28) ప్రమాదవశాస్తూ ఈ నెల 18న స్విమింగ్‌పూల్‌లో పడి మృతి చెందారు. తండ్రి చనిపోయినా తల్లి కూలిపనులు చేసి రవితేజను ఉన్నత చదువులకోసం అమెరికా టెక్సాస్‌లోని ఆస్టిన్ నగరంలో ఒక విశ్వవిద్యాలయంలో ఎంఎస్ చదివేందుకు పంపారు. అయితే తమిళనాడుకు చెందిన తన మిత్రుడితో కలసి అక్కడి స్విమింగ్ పూల్ దగ్గరకు వెళ్లి ప్రమాదవశాస్తూ అందులోపడి మృతిచెందాడు. ఉన్నత స్థాయిలో తిరిగి వస్తాడని కలలు కన్నతల్లికి బిడ్డ ప్రమాదవశాత్తూ మృతి చెందాడన్న పిడుగులాంటి వార్తతో గుండెలు పగిలేలా రోధించింది. మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే మంత్రి మనోహర్ దృష్టికి విషయం తెలపడంతో వారు సకాలంలో స్పందించారు. అమెరికా నుంచి మృతదేహాన్ని స్వస్థలమైన తెనాలికి తరలించేలా కృషి చేశారు. శుక్రవారం సాయంత్రం అమెరికా నుంచి తెనాలికి రవితేజ మృతదేహం చేరుకుంది. భారీ ఊరేగింపుగా రవితేజ మృతదేహాన్ని అతడి స్నేహితులు, బంధువులు, కుటుంబసభ్యులు తెనాలి ఐతానగర్‌లోని నివాసానికి చేర్చారు. ఐతానగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. శనివారం అంతిమ సంస్కారాలు జరుగుతాయని రవితేజ బంధువులు తెలిపారు.



యాంటీ లార్వా స్ప్రే చేసే డ్రోన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న, కౌన్సిలర్ వెంకటేశ్వరావు తదితరులు

దోమల నివారణకు చర్యలు

తెనాలి, మారీసుపేట జూలై 26: పట్టణంలో దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలను పట్టణ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక చేపట్టారు. శుక్రవారం 4వ వార్డులోని బీసీ కాలనీలోని ఖాళీస్థలాలో దోమల వ్యాప్తిని నిరోధించడానికి నీటి నిల్వలపై డ్రోన్ ద్వారా మున్సిపల్ సిబ్బందితో యాంటీ లార్వా స్ప్రేను పిచ్చికారి చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూడలన్నారు. జిల్లాలో ఎక్కడ జరగని విధంగా మన పురపాలక సంఘంలో డ్రోన్‌తో యాంటీ లార్వా చల్లేందుకు కృషిచేసిన మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మలను అభినందించారు. టీడీపీ కౌన్సిలర్ వెంకటేశ్వరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వలన సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. అనంతరం పట్టణంలోని 23వ వార్డులోని కొబ్బరితోటలో దోమలు వ్యాప్తి చెందకుండా యాంటీ లార్వాను డ్రోనతో చల్లించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న, ఎంహెచ్‌వో డాక్టర్ కారుమూరి హెలెన్ నిర్మల, వైస్‌ఛైర్మన్ మాలేపాటి హరి, శానిటేషన్, మలేరియా, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తెనాలి రూరల్, జూలై 26: కోడిపందేలు వేస్తున్న పందెంరాయుళ్లను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని కొలకలూరు శివారు పంట పొలాల్లో కోడి పందేలు జోరుగా సాగుతున్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారంతో శుక్రవారం దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో ఐదుగురు పందెంరాయుళ్లు, 8 ద్విచక్రవాహనాలు, రూ.17000 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

రాష్ట్రాన్ని నాశనం చేసిన వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

కొల్లిపర, జూలై 26: ఐదేళ్ల వైసీపీ పరిపాలనలో రాష్ట్రాన్ని నాశనం చేసిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యలు ఏమైనా ఉంటే గౌరవప్రదంగా అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడాల్సిన వ్యక్తి అక్కడ మాట్లాడకుండా రాష్ట్రంలో నరమేధం జరుగుతోందని ఢిల్లీ పాలకులకు తెలియజేయాలనుకోవటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనంచేసిన వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గడిచిన ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన అకృత్యాలు, కబ్జాలతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారన్నారు. రాచరిక వ్యవస్థను తలపించేలా నియంతృత్వ పోకడలతో పాలనచేసిన వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేతను, ప్రభుత్వాన్ని కించపరిచేలా ఢిల్లీలో మాట్లాడటం సిగ్గుచేటన్నారు. లక్ష కోట్లకు పైగా అవినీతి చేయడమే కాక ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని విమర్శించారు. సమావేశంలో టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, భీమవరపు లంకకోటిరెడ్డి, బొల్లు యోగానందచటర్జీ, కోమటి శ్రీనివాసరావు, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట జూలై 26: పట్టణంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు శ్రీవెంకటేశ్వరయోగ సేవా కేంద్రం సభ్యులు అన్నదానం చేశారు. స్థానిక నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రంలో శుక్రవారం ఎస్‌వీ యోగా సభ్యులు జవ్వాది ఆంజనేయులు వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి, ఆహారాన్ని అందించారు. కార్యక్రమంలో ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, మానేపల్లి శివ, అనూష, వజ్రాల రామలింగాచారి, మురళి, భారతి తదితరులు పాల్గొన్నారు.



నాగిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సీపీఎం నాయకులు

సీపీఎం సీనియర్ నాయకుడు నాగిరెడ్డి మృతి

● పలువురు నాయకుల సంతాపం

కొల్లిపర, జూలై 26: మండల కేంద్రం కొల్లిపరలో సీపీఎం నాయకుడు గుదిబండి నాగిరెడ్డి (86) అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం నాగిరెడ్డి మృతదేహానికి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, డి. రమాదేవి, ఉమామహేశ్వరరావు, కె.ధనలక్ష్మి, జిల్లా నాయకులు పి.రామారావు, నేతాజీ, సీఐటీయూ నాయకులు ములకా శివసాంబిరెడ్డి, భావన్నారాయణ, రామారావు, కోటా చంద్రశేఖర్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కల్లం వీరారెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, వంగా సాంబిరెడ్డి, గుదిబండి గోవర్ధనరెడ్డి, కంచర్ల అమృతరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ పోరాటాల ద్వారా ఎర్రజెండా కీర్తి ప్రతిష్టలను ప్రజల్లోకి తీసుకెళ్ళిన వ్యక్తి నాగిరెడ్డి అని ఆయన మరణం పార్టీకి తీరనిలోటన్నారు. నివాళులర్పించిన వారిలో పంచాయతీ, ఆషా, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు తదితరులు ఉన్నారు.

ఇసుక కోసం మూడు రోజులు పడిగాపులు

● కొల్లిపర ఇసుక స్టాక్ పాయింట్‌లో నాయకుల హవాతో గందరగోళం

● జేసీకి మొరపెట్టుకున్న వినియోగదారులు



కొల్లిపర ఇసుక స్టాక్ పాయింట్‌లో ఇసుక కోసం వచ్చిన వారితో మాట్లాడుతున్న జేసీ భార్గవ్‌తేజ

కొల్లిపర, జూలై 26: ఇసుక కోసం మూడు రోజులు పడిగాపులు పడాల్సి వస్తోందని జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ ఎదుట ఇసుక కోసం వచ్చిన వినియోగదారులు, వాహనదారులు మొరపెట్టుకున్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర సమీపంలో ఉన్న ఇసుక స్టాక్ పాయింట్‌ను ఆయన తహసీల్దార్ శ్రీనివాసులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. స్టాక్‌పాయింట్ వద్ద నిర్వహిస్తున్న రిజిస్టర్లను, రికార్డులను, క్యూ ఆర్ కోడ్ ద్వారా డిజిటల్ చెల్లింపుల విధానాన్ని పరిశీలించారు. స్టాక్ పాయింట్లలో ఇసుకలోడింగ్ ఏలా జరుగుతుందని, టోకెన్లు వరుసక్రమంలో ఇస్తున్నారా... ఇసుక లోడింగ్ ఏ విధంగా చేస్తున్నారంటూ ఇసుక కోసం వచ్చిన వారిని, వాహనదారులను అడిగి తెలుసుకున్నారు. మీరు ట్రాక్టర్ ఇసుకను ఎంతకు తోలుతున్నారని వాహనదారులను అడగటంతో వారి బాధలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. 20కిలో మీటర్లు వరకు రూ.2వేలు మాత్రమే తీసుకుంటున్నామని, ఇసుక స్టాక్ పాయింట్‌లో గందరగోళంగా ఉందని, ఇక్కడ నాయకుల హవా కొనసాగుతోందని, ఇక్కడ స్లిప్పుల పంపిణీ నాయకులు తమకు ఇష్టం వచ్చిన వారికి ఇవ్వడం వలన ఇసుక కోసం మూడు రోజులు ఉండాల్సి వస్తోందని వాపోయారు. ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఉచిత ఇసుక విధానం బాగుందని కాని స్టాక్ పాయింట్‌లలో నాయకులు ఉండటం వలన వారి లారీలకు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ వాహనదారులు, ఇసుక వినియోగదారులు తమ గోడును జేసీ ఎదుట వెళ్ల బుచ్చుకున్నారు. దీంతో జేసీ భార్గవ్‌తేజ మాట్లాడుతూ ఇసుక స్టాక్ పాయింట్‌లలో ఆ పరిస్థితి రాకుండా చూచుకుంటామన్నారు. ప్రజలు ఇసుక కోసం ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా జిల్లాలో పలుచోట్ల ఇసుక స్టాక్ పాయింట్‌లను ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. అనంతరం మండల పరిధిలోని మున్నంగి ఇసుక స్టాక్ పాయింట్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడ కూడా రిజిస్టర్లను, రికార్డులను, క్యూ ఆర్ కోడ్ ద్వారా డిజిటల్ చెల్లింపుల విధానాన్ని పరిశీలించి ఇసుక కోసం వచ్చిన వారిని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని, చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. జేసీ వెంట ఈవో పీఆర్‌డీ పూర్ణశంకరరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, ఏపీఎం ప్రియదర్శిని తదితరులు ఉన్నారు.



కొల్లిపర ఇసుక స్టాక్ పాయింట్‌లో లోడింగ్ చేసే విధానాన్ని పరిశీలిస్తున్న జేసీ భార్గవ్‌తేజ

చేనేత ఉద్యమ పితామహుడు ప్రగడ కోటయ్య

ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, జూలై 26: జీవితాంతం చేనేత సమస్యలపై పోరాడి చేనేత ఉద్యమ పితామహుడిగా ప్రగడ కోటయ్య నిలిచారని ఎమ్మెల్యే సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పట్టణంలోని వీవర్స్ కాలనీలో ప్రగడ కోటయ్య జయంతి ఉత్సవాలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా ప్రగడ కోటయ్య విగ్రహానికి ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రగడ కోటయ్య చేనేతరంగ అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడ్డారన్నారు. చేనేత కార్మికులు చేనేత రంగ అభివృద్ధికోసం ప్రగడ కోటయ్య వేసిన బాటలు నేటికీ కొనసాగుతున్నాయన్నారు. కేవలం నేత కార్మికులే కాకుండా రైతులు, రైతు కూలీల కోసం ప్రగడ కోటయ్య ఉద్యమించారని గుర్తుచేసుకున్నారు. శాసనమండలి సభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా ప్రగడ కోటయ్య ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుడ్డారని కొనియాడారు. అనంతరం పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలతోపాటు, వీవర్స్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



ప్రగడ కోటయ్య జయంతి సందర్భంగా దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

తెనాలిలో...

తెనాలి, మారీసుపేట జూలై 26: పట్టణ పరిసర గ్రామాలో చేనేత బాంధవుడు ప్రగడ కోటయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని జగ్గడిగుంటపాలెం ప్రగడ కోటయ్య నగర్‌లో శుక్రవారం ప్రగడ కోటయ్య విగ్రహం వద్ద ఆయన 109వ జయంతి వేడుకలను బీసీ సంక్షేమ సంఘ నియోజకవర్గ జొన్నాదుల వెంకటేశ్వరావు అధ్యక్షతలో నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగడ కోటయ్య చేనేత రంగానికే కాక, వ్యవసాయ అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఈ చేనేత రంగాన్ని ప్రభుత్వం మరింతగా బలోపేతం చేయవలసిన అవసరం ఉందన్నారు. ప్రగడ కోటయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు కొడాలి శ్రీను, వంగర సత్యనారాయణ, జొన్నాదుల నాగేశ్వరావు, గొగుపర్తి వీరబ్రద్రరావు, శ్రీనివాసు, పున్నయ్య, కృష్ణ, అంజయ్య, ఉమామల్లేశ్వరావు, జోజోకృష్ణ, కోటిస్వామి తదితరులు పాల్గొన్నారు.



ప్రగడ కోటయ్య విగ్రహానికి పూలమాలను వేసి నివాళి అర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు

వృద్ధాశ్రమంలో ...

తెనాలి అర్బన్, జూలై 26: మహాత్మాగాంధీ సేవా శాంతి ఆశ్రమంలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు, చేనేత కార్మికుల సంక్షేమ నేత ప్రగడ కోటయ్య జయంతి నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ గుర్రం ద్వారకా శీను వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఐటీఐ వద్ద ఉన్న కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

డిజిటల్ వనరుల వినియోగంపై అవగాహన

తెనాలి, మారీసుపేట జూలై 26: విద్యార్థులకు డిజిటల్ వనరుల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గంగానమ్మపేటలోని తోటకూర సుబ్బారావు మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం శిక్షా సప్తాహ్ కార్యాక్రంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.ప్రసన్నకుమార్ డిజిటల్ వనరుల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, జయంత్‌బాబు, పాఠశాల దాత తోటకూర వెంకట రమణరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం 2020 ప్రవేశపెట్టి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులు డిజిటల్ వనరులను వినియోగించుకొని తమ విద్యను మెరుగుపర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన కంప్యూటర్ ల్యాబ్, సైన్స్‌ల్యాబ్, ఇంగ్లీష్ ల్యాబ్‌లను ప్రాంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జి.హరేరామ్, జి.బాబురావు, వీరబాబు, జ్యోతిరావు, సాజీదాపర్వీన్, కె ప్రవీన విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ

తెనాలి అర్బన్, జూలై 26: కార్గిల్ విజయ్‌దివస్ ర్యాలీని శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఐతానగర్ లింగారావు సెంటర్ నుంచి మారీసుపేట ఎన్‌సీఆర్‌ఎన్‌ఎం హైస్కూల్ వరకు జరిగిన ర్యాలీలో ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. 22ఏ బెటాలియన్ ఆధ్వర్యంలో 200 మంది క్యాడెట్లు కార్గిల్ విజయంపై నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. లెఫ్టినెంట్ కల్నల్ మహేష్ మాట్లాడుతూ, విద్యార్థులంతా దేశభక్తి, జాతీయత భావం కలిగి ఉండాలన్నారు. దేశ సమగ్రతను, సమైక్యతను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. ర్యాలీలో వీఎస్‌ఆర్ కళాశాల, కోగంటి శివయ్య హైస్కూల్, చెంచు రామానాయుడు హైస్కూల్, ఎన్‌సీసీ క్యాడెట్లు 200 మంది ర్యాలీలో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, స్వామి, భాస్కర్, అశోక్ తదితరులు పర్యవేక్షించారు.



కాళీ మాతకు సారె సమర్పిస్తున్న భక్తులు

ఘనంగా అమ్మవారికి ఆషాడ సారె


తెనాలి అర్బన్, జూలై 26: శివాజీ చౌక్‌లోని కాళీ మాత అమ్మవారికి శుక్రవారం ఆషాడ సారె కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పూలు, పండ్లు, స్వీట్లు సమర్పించి పూజలు చేశారు. కొందరు మహిళలు బోనాలు అందుకున్నారు. కమిటీ ఛైర్మన్ గుమ్మడి రమేష్, సభ్యులు పాల్గొన్నారు.



ముంపుగ్రామ ప్రజలకు దుస్తులను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ముంపు బాధితులకు రోటరీ క్లబ్ సాయం

తెనాలి, మారీసుపేట జూలై 26: పోలవరం ముంపు బాధితులకు రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సభ్యులు సాయంచేశారు. శుక్రవారం వర రామచంద్రాపురం మండలం శ్రీరామ్‌గిరి గ్రామస్తులకు రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, హైదరాబాద్ జూబ్లీహిల్స్ క్లబ్, తాడేపల్లి క్లబ్, మంగళగిరి క్లబ్ తరఫున వెళ్లి వారికి దుస్తులను, టార్పాలిన్, దోమతెరలు, ఆహార అవవసరాలకు సామాగ్రీని అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ డ్రిస్టిక్ గవర్నర్ ఎలెక్ట్ ఎస్‌వి రాంప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, జి శ్రీనివాస్, రావూరి శ్రీనివాసరావు, డిస్ట్రిక్ క్యాబినేట్ నెంబర్ ఈదర వెంకట పూర్ణచంద్, నల్లూరి వెవంకటేశ్వరావు, సుకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాజీ సైనికుడు రఫీని సత్కరిస్తున్న బీజేపీ, జనసేన నాయకులు

కార్గిల్ యుద్ధ వీరుల సేవలు మరువలేనివి

● బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెంకట కృష్ణారావు

పొన్నూరు టౌన్, జూలై 26: దేశం కోసం కార్గిల్‌లో జవాన్లు చేసిన సేవలు మరువలేనివి అని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గోవాడ వెంకట కృష్ణారావు అన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్‌లో అశువులు బాసిన వీరజవాన్లకు నివాళి అర్పించారు. పొన్నూరు పట్టణానికి చెందిన జవాన్, కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న రఫీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, మండల అధ్యక్షుడు నాగిశెట్టి సుబ్బారావు, వల్లంశెట్టి శ్రీధర్, టీడీపీ నాయకులు హాసైన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

తెనాలి రూరల్, జూలై 26: మండలంలోని నందివెలుగు జామవా నగర్‌లో ప్రసూన చారిటబుల్ ట్రస్ట్ దత్తతతీసుకున్న 25మంది పేద వృద్ధులకు ఆ గ్రామ జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ హెచ్ఎం గొళ్లశివపార్వతి సహకారంతో ప్లేట్లు పంపిణీ చేశారు. అదే స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సుబ్బారావు సహకారంతో గ్లాసులు పంపిణీ చేసినట్లు ట్రస్ట్ నిర్వాహకులు జాన్‌బాబు ఓ ప్రకటన ద్వారా తెలిపారు.

21 మంది తహసీల్దార్లు వెనక్కు

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణ కోసం ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి గుంటూరుకు వచ్చిన 21మంది తహసీల్దార్లను కలెక్టర్ నాగలక్ష్మి వారి సొంత జిల్లాలకు వెనక్కు పంపించారు. సీసీఎల్ఏ జయలక్ష్మి ఆదేశాల మేరకు శుక్రవారం వారిని రిలీవింగ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తాడికొండ తహసీల్దార్ పీ మధుసూదనరావు, కే వెంకటేశ్వరరావు (మంగళగిరి), కే రవిబాబు (దుగ్గిరాల), పీ పార్వతి (కాకుమాను), టీ శ్రీనివాసులు (వట్టిచెరుకూరు), కే రవీంద్రరెడ్డి (గుంటూరు పశ్చిమ)లను పూర్వపు ప్రకాశం జిల్లాకు పంపించారు. అలానే వీ సుధీర్ (తుళ్లూరు), జీ రాఘవేంద్రరావు (ఫిరంగిపురం), కే రాజ్యలక్ష్మి (మేడికొండూరు), టీ విజయకుమార్ (తాడేపల్లి), ఆర్ సూర్యనారాయణ సింగ్ (పొన్నూరు), ఈ రమాదేవి (చేబ్రోలు), ఎస్ శ్రీనివాసులురెడ్డి (తెనాలి), ఎన్ శ్రీనివాసులు (కొల్లిపర), ఎం పద్మజ (ప్రత్తిపాడు), డీ లాజరస్ (పెదనందిపాడు), టీ విజయకుమార్ (ఏవో), పీ శాంతకుమారి (మేజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్), ఎం నిరంజన్ (డీఏవో, గుంటూరు ఆర్‌డీవో), కే జయజయరావు (డీఏవో, తెనాలి సబ్ కలెక్టర్ ఆఫీసు)లను పూర్వ నెల్లూరు జిల్లాకు పంపించారు. ఎన్నికల విధుల కోసం ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు కూడా అక్కడ రిలీవింగ్ అయి శని/సోమవారాల్లో కలెక్టరేట్‌కు వచ్చి రిపోర్టు చేయనున్నారు. వారికి కలెక్టర్ పోస్టింగ్‌లు కల్పిస్తారు. అప్పటి వరకు డిప్యూటీ తహసీల్దార్లకు ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ బాధ్యతలు కల్పించారు.

గడవు ముగిసినా కొనసాగుతున్న పెదకాకాని తహసీల్దార్

ఏపీ సచివాలయం నుంచి 2022లో రెండేళ్ల సర్వీసు నిమిత్తం వచ్చిన తహసీల్దార్ రత్నం పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీతో ముగిసింది. అయినప్పటికీ ఆయన్ని అప్పటి కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి రిలీవ్ చేయలేదు. దాంతో నేటికీ పెదకాకాని తహసీల్దార్‌గా రత్నం కొనసాగుతున్నారు. ఇప్పుడు వేరే జిల్లాలకు వెళ్లిన ఇక్కడి తహసీల్దార్లు వెనక్కు వచ్చేయడంతో వారికి పోస్టింగ్‌లు కేటాయించే విషయంలో సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది.

గోకులాల నిర్మాణం హర్షణీయం : టీడీపీ

పొన్నూరు టౌన్, జూలై 26: పేద, పశువుల పెంపకందారులకు గోకులాలు నిర్మించటానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం హర్షణీయం అని గుంటూరు పార్లమెంటు రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పిందన్నారు. ఈ పెంపకందారుల షెడ్ల నిర్మాణం కోసం 90శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లు నిర్మించుకుంటే 70శాతం రాయితీ వస్తుందన్నారు. యూనిట్‌కి గరిష్ఠంగా రూ.60,900 నుంచి రూ.2,07,000 వరకు పెంపకందారులకు లబ్ధి చేకూరుతుందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ గోకులం నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ పథకం నిర్మాణం వలన రాష్ట్రంలోని పేద రైతులకు లబ్ధి చేకూరుతుందని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా సూచించారు. గోకులం నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌లకు ధన్యవాదాలు తెలియజేపారు. సమావేశంలో టీడీపీ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబురావు, పొట్టూరి హనుమత్ దుర్గా ప్రసాద్, నక్కల ప్రసాద్, చలమశెట్టి సీతరామయ్య, గరిగంటి సాయిబాబు, నిమ్మగడ్డ వెంకటధర్మారావు, తోట రాధకృష్ణమూర్తి, దాసరి మహంకాళేశ్వర సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



బాల్య వివాహాల నిరోధంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పొన్నూరు టౌన్, జూలై 26: బాల్య వివాహాలు చట్టరీత్య నేరం అని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ వి.శ్యామల అన్నారు. పట్టణంలోని 5వ వార్డు మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం కిషోర బాలికలకు బాల్య వివాహాల నిరోధం, చైల్డ్ హెల్ప్ లైన్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ బాల్య వివాహాల నేరాల చట్టం 2006లో అమలులోకి వచ్చిందన్నారు. యుక్త వయస్సు రాకుండా వివాహాలు చేయటం నేరంగా పేర్కొన్నారు. అంతేకాకుండా బాలికలకు వివాహాలు చేస్తే జరిగే ఇబ్బందుల గురించి అవగాహన కల్పించారు. అలాగే సమానత్వపు హక్కు, సాంస్కృతిక, విద్యా హక్కు గురించి వివరించారు. అనంతరం సమతుల ఆహారం, రక్తహీనత నిరోధంపై తల్లులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు అందించాలన్నదే ధ్యేయం

● స్వచ్ఛ భారత్ మిషన్ మండల కో- ఆర్డినేటర్ వెంకటరెడ్డి

కొల్లిపర, జూలై 26: ఇంటింటికీ రక్షిత తాగునీటిని అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని స్వచ్ఛభారత్ మిషన్ మండల కో-ఆర్డినేటర్ మర్రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పిడపర్రు సచివాలయం వద్ద జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సభకు సర్పంచ్ రత్నబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ హర్‌ఘర్‌జల్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి నిత్యం 55లీటర్లు తాగునీటిని సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలు తాగునీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరరెడ్డి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అమ్మిన వ్యక్తికి రూ.5వేలు జరిమానా

కొల్లిపర, జూలై 26: మండల పరిధిలోని అత్తోటకు చెందిన సోగా భాస్కరరావు 2019 సంవత్సరంలో గంజాయి సేవిస్తుండంతో పాటు అమ్మటంతో అప్పటి ఎస్ఐ శ్రీనివాసరెడ్డి కేసునమోదు చేశారు. అప్పటి కేసు విచారణ జరిగి శుక్రవారం రెండో అదనపు సివిల్ జడ్జి పి.రాజశేఖర్ రూ.5వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు.

శాకాంబరిగా కనకదుర్గ భవానీ అమ్మవారు



శాకాంబరి అలంకారంలో ఉన్న కనకదుర్గా భవాని అమ్మవారు

పొన్నూరు టౌన్, జూలై 26: ఆషాడమాసంను పురస్కరించుకుని శుక్రవారం కనకదుర్గా భవానీ అమ్మవారు శాకాంబరి మాతగా భక్తులకు దర్శనం ఇచ్చింది. పట్టణంలోని జీబీసీ రోడ్డులోని కనకదుర్గా భవానీ ఆలయంలో వేకువ జామున అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శాకాంబరి మాతగా వివిధ రకాల ఫలాలు, కూరగాయలతో అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలయంలో అమ్మవారికి సామూహిక కోటి కుంకుమార్చన జరిగింది. ఈ పూజా కార్యక్రమాలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్ని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పొన్నూరు టౌన్, జూలై 26: సీజనల్ వ్యాదులపై అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఆర్.సూర్యనారయణసింగ్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పొన్నూరు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డెంగీ, మల్లేరియా, టైఫాయిడ్ వ్యాధుల వ్యాప్తిపై అవగాహన కల్పించారు. విష జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో కె.శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ అలేకియా, రెడ్ క్రాస్ ఛైర్మన్ జిడి గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పొన్నూరు టౌన్, జూలై 26: మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం బాపట్ల నుంచి గుంటూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఇసుక లారీ చింతలపూడి వద్ద ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సులోని ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలు కాగా, 108 వాహనంలో పొన్నూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ప్రమాదంపై రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.